SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 | సంచిక : 270 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 08, జూన్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

# నివురుగప్పిన నిప్పు!



- మస్క్ గురించి ఆలోచించడం లేదని ట్రంప్ వ్యాఖ్య
- ఆయన బాగుండాలంటూనే విమర్శలు
- 'ద అమెరికా పార్టీ' అంటూ మస్క్ ట్వీట్
- ఇద్దరూ తగ్గాలని రిపబ్లికన్ల హితవు

వాషింగ్టన్: అమెరికాలో ఇద్దరు శక్తిమంతమైన వ్యక్తుల మధ్య చెలరేగిన ఘర్షణ నివురుగప్పిన నిప్పులా ఉంది. ఒకరిపై ఒకరు తీవ్రంగా వ్యాఖ్యలు చేసుకున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌లు ఎవరి పనిలో వారు పడిపోయారు. తాను వేరే పనులతో బిజీగా ఉన్నానని ట్రంప్ వ్యాఖ్యానించగా.. 'ద అమెరికా పార్టీ' అంటూ మస్క్ ట్వీట్ చేశారు. మరోవైపు ఇద్దరూ కాస్త తగ్గాలని రిపబ్లికన్లు పిలుపునిచ్చారు. 'నేను బిజీగా ఉన్నా. చైనా, రష్యా, ఇరాన్ అంశాలపై పని చేస్తున్నా. నాకు చాలా పనులున్నాయి. మస్క్ గురించి ఇప్పుడు ఆలోచించడం లేదు. ఆయన బాగుండాలని కోరుకుంటున్నా' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'మేం అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుంటున్నాం. ఆయన (మస్క్) చాలా సబ్సిడీలు పొందారు. పెద్ద మొత్తంలో డబ్బులు అందుకున్నారు. దాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉంది. అంతా పారదర్శకంగానే జరిగిందా.. అనేది చూడాలి. మస్క్ లేకపోయినా మా ప్రభుత్వం కొనసాగుతుంది. ఎవరు లేకపోయినా అమెరికాకు ఏం కాదు.. ఒక్క నేను తప్ప' అని ట్రంప్ స్పష్టం చేశారు. మస్క్‌తో ప్రైవేటుగా మాట్లాడాలని తాను ప్రయత్నిస్తున్నానంటూ వస్తున్న కథనాలను ఆయన ఖండించారు. 'నాకు అలాంటి ప్రణాళికలు ఏమీలేవు. ఎవరో తప్పుగా ఆ కథనాలు రాసి ఉంటారు. నేను దాని గురించి ఆలోచించట్లేదు. ప్రస్తుతానికి ఆయనతో మాట్లాడే ఉద్దేశం నాకు లేదు. ఎలాన్ మస్క్‌కు మైండ్ సరిగ్గా పనిచేయడం లేదు' అంటూ విభేదాలను మరింత పెంచేలా ట్రంప్ మాట్లాడారు.

**వెనక్కి తగ్గిన మస్క్**

తరువాయి 2లో



## తెలంగాణ బియ్యానికి బ్రాండింగ్

- మిగులు సన్నధాన్యంపై దృష్టి
- 'బీపీటీ, ఆర్ఎన్ఆర్' ప్రత్యేకంగా నిల్వ
- ఓపెన్ మార్కెట్లో విక్రయానికి ప్రణాళికలు

**జూన్ 07, సమయం న్యూస్, హైదరాబాద్:** రాష్ట్ర అవసరాలకు మించి సన్న వడ్లు వస్తుండటంతో మిగులు ధాన్యాన్ని మిల్లింగ్ చేయించి బియ్యాన్ని విక్రయించేందుకు పౌరసరఫరాల సంస్థ సిద్ధం

తరువాయి 2లో

# నేడు మంత్రివర్గ విస్తరణ



- శ్రీహరి, వివేక్, లక్ష్మణ్‌కుమార్‌లకు చోటు
- ఉప సభాపతిగా రామచంద్రునాయక్!

**జూన్ 07, సమయం న్యూస్ , హైదరాబాద్:** రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధమైంది. కొత్తగా ముగ్గురికి చోటు దక్కనుంది. ఆదివారం మధ్యాహ్నం 12.00 12.20 గంటల మధ్య ప్రమాణస్వీకారం జరగనుంది. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం.. బీసీల నుంచి వి.శ్రీహరి ముదిరాజ్, ఎస్సీల నుంచి వివేక్ (మాల), అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ (మాదిగ)లకు చోటు లభించనుంది. శాసనసభ ఉప సభాపతిగా రామచంద్రునాయక్‌ను ఎంపిక చేసినట్లు తెలిసింది. విస్తరణలో సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి తీసుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా మంత్రివర్గ విస్తరణలో సుదర్శన్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిల పేర్లు

తరువాయి 2లో

## ఎమ్మెల్యేలు గాడి తప్పితే వదులుకోవడానికీ సిద్ధం

- ప్రభుత్వానికి, పార్టీకి నష్టం కలిగిస్తే ఉపేక్షించను
- వన్‌టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోతామంటే అది మీ ఇష్టం
- అందరి పనితీరు, వ్యవహారశైలిపై సమాచారం ఉంది
- త్వరలో ప్రతి ఒక్కరితో ముఖాముఖి
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు




## రాజీవ్ స్వగృహ, హౌసింగ్ బోర్డు స్థలాల వేలం



- ప్రభుత్వం నిర్ణయం.. 20న నోటిఫికేషన్‌కు సన్నాహాలు
- రూ.3,500 కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా
- వచ్చే సొమ్ము సంక్షేమ పథకాలకు ఖర్చు చేసే యోచన

**జూన్ 07, సమయం న్యూస్, హైదరాబాద్:** హౌసింగ్ బోర్డు పరిధిలోని రాజీవ్ స్వగృహ, హౌసింగ్ బోర్డు స్థలాలను వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్, హౌసింగ్ బోర్డు కమిషనర్ గౌతమ్.. ఈ మేరకు ప్రతిపాదలను సిద్ధం చేయగా వనరుల సమీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఈ నెల 20న నోటిఫికేషన్ విడుదల చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వేలం ద్వారా రూ.3,500 కోట్లకుపైగా ఆదాయం వచ్చే అవకాశాలున్నాయని గృహ నిర్మాణ శాఖ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో వెల్లడించినట్లు తెలిసింది. ఈ నిధులను అభివృద్ధి కార్యక్రమాలకు, ఇందిరమ్మ ఇళ్ల పథకంతోపాటు మధ్య తరగతి గృహ నిర్మాణాలకు ఉపయోగించనున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.


**11 ప్రాంతాల పరిధిలో..**

గృహ నిర్మాణ శాఖ ప్రతిపాదనల మేరకు..రాజీవ్

తరువాయి 2లో

## రాజధానిలో 65 వేల కొత్త ఆటోలు

- ఎలక్ట్రిక్, సీఎన్జీ, ఎల్పీజీతో నడిచే వాటికే అనుమతి
- ఔటర్ రింగ్ రోడ్డు లోపల తిరిగేలా పర్మిట్లు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- వేల కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది: మంత్రి పొన్నం



**జూన్ 07, సమయం న్యూస్, హైదరాబాద్:** జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఆటోల సంఖ్యను పెంచేందుకు అనుమతిస్తున్నట్లు రవాణాశాఖ పేర్కొంది. కాలుష్య సమస్య నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో కొత్త ఆటోలకు అనుమతులు ఇవ్వట్లేదు. అయితే నగరంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చివెళ్లే ప్రజలతో ఆటోలకు డిమాండ్ పెరిగింది. ఈ పరిస్థితుల్లో కొత్త ఆటోలకు పర్మిట్ల జారీకి అనుమతివ్వాల్సిందిగా రవాణాశాఖ కమిషనర్ ఫిబ్రవరిలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. పరిశీలించిన

తరువాయి 2లో



## శత్రుత్వం ముగుస్తుందా..!

- మోదీ కెనడా పర్యటనపై సర్వత్రా ఆసక్తి

జీ7 శిఖరాగ్రసదస్సుకు భారత్‌ను కెనడా ఆహ్వానిస్తుందా లేదా అనే దానిపై పలు ఊహాగానాలు చెలరేగాయి. కెనడా ఆహ్వానించదని, ఒకవేళ పిలిచినా భారత్ తిరస్కరిస్తుందని పలు కథనాలు వెలువడ్డాయి. వాటిని పటాపంచలు చేస్తూ కెనడా ప్రధాని మార్క్ కార్నీయే స్వయంగా మోదీని ఆహ్వానించడం, అందుకు ఆయన అంగీకరించడం చకచకా జరిగిపోయాయి.

తరువాయి 2లో

# నేడు మంత్రివర్గ విస్తరణ

(మొదటిపేజీ తరువాయి)

మొదటి నుంచీ వినిపించినా ప్రస్తుతానికి ఎస్సీ, బీసీలకు మాత్రమే అవకాశం ఇవ్వాలని అధిష్ఠానం చెప్పినట్లు తెలిసింది. అయితే మాదిగ సామాజికవర్గంతోపాటు ఎస్టీల నుంచి కూడా ఒకరికి అవకాశం ఇవ్వాలని.. నిజామాబాద్ జిల్లా నుంచి సుదర్శన్‌రెడ్డికి కూడా చోటు కల్పించాలని ముఖ్యమంత్రి పట్టుబడుతున్నట్లు సమాచారం. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి అవకాశం ఇస్తే ఆయన సోదరుడు, మంత్రి వెంకట్‌రెడ్డిని కూడా కొనసాగించడం కష్టమని, ఇద్దరిలో ఒకరికి మాత్రమే చోటు కల్పించాల్సి ఉంటుందని అధిష్ఠానం స్పష్టంచేయడంతో ఈ అంశాన్ని ప్రస్తుతానికి పక్కనపెట్టినట్లు తెలిసింది.

**విస్తృత చర్చల అనంతరం..**

గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌లతో కాంగ్రెస్ అధిష్ఠానం చర్చించింది. అందరి అభిప్రాయాలు విన్న తర్వాత ఎవరెవరికి చోటు కల్పించాలో నిర్ణయం చెబుతామన్న అధిష్ఠానం శనివారం తన అభిప్రాయాన్ని తెలిపినట్లు సమాచారం. అనంతరం పార్టీకి సంబంధించిన పలువురు నాయకులతో ముఖ్యమంత్రి చర్చించినట్లు తెలిసింది. నాలుగో పేరును ప్రస్తుతానికి పక్కనపెట్టి రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ముగ్గురికి అవకాశం కల్పిస్తే మరో మూడు స్థానాలు ఖాళీగా ఉంటాయి. వీటితోపాటు చీఫ్ విప్ పదవి భర్తీకి కూడా కసరత్తు సాగుతోంది. బీసీల నుంచి ఆది శ్రీనివాస్ ప్రస్తుతం శాసనసభలో విప్‌గా ఉన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి మంత్రివర్గంలో ఎవరూ లేనందున వికారాబాద్ ఎమ్మెల్యే, సభాపతి ప్రసాద్‌కుమార్‌ను మంత్రివర్గంలోకి తీసుకుని అదే సామాజికవర్గానికి చెందిన మరొకరికి సభాపతి పదవి ఇస్తే ఎలా ఉంటుందనే అంశం కూడా పార్టీ పరిశీలనలో ఉన్నట్లు నేతలు చెబుతున్నారు. మంత్రి పదవుల కోసం గట్టిగా పోటీపడుతున్నవారిలో ఒకరికి చీఫ్ విప్ పదవి ఇచ్చి సర్దుబాటు చేసే అవకాశాలున్నాయి. గత 4 రోజులుగా హైదరాబాద్‌లోనే ఉన్న మీనాక్షి నటరాజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించిన నేపథ్యంలో సామాజిక న్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని విస్తరణ ఉండాలని అధిష్ఠానానికి సూచించినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. పార్టీ లైనుకు భిన్నంగా ఎవరు మాట్లాడినా తదుపరి పదవుల్లో వారికి ప్రాధాన్యం ఉండదని స్పష్టం చేస్తున్నట్లు సమాచారం.

**సీఎంకు వినతిపత్రం..**

ఎస్సీ వర్గీకరణ అమలుకు దేశంలోనే తొలిసారి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టినందున దానిప్రకారం మంత్రివర్గంలో తమ వర్గానికి తగు ప్రాతినిధ్యం కల్పించాలని మాదిగ సామాజికవర్గ ఎమ్మెల్యేలు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వేముల వీరేశం, సామేల్, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య సీఎంను కలిసినవారిలో ఉన్నారు. గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా తమ వర్గానికి తగినన్ని టికెట్లు ఇవ్వలేదని, అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అవకాశం రాలేదని, మంత్రివర్గంలో తప్పనిసరిగా ఒకరికి చోటు కల్పించాలని వారు సీఎంను కోరినట్లు తెలుస్తోంది.

# తెలంగాణ బియ్యానికి బ్రాండింగ్

(మొదటిపేజీ తరువాయి)

అవుతోంది. సన్నబియ్యంలో బీపీటీ, ఆర్ఎన్ఆర్, జై శ్రీరాం రకాలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఈ మూడు కేటగిరీలను పౌరసరఫరాల సంస్థ ప్రత్యేకంగా నిల్వ చేయించింది. తెలంగాణ బ్రాండ్ పేరుతో ప్యాక్ చేయించి ఓపెన్ మార్కెట్లో విక్రయించనున్నట్లు పౌరసరఫరాల సంస్థ వర్గాలు తెలిపాయి.

**వానాకాలంలో పండించిన వడ్లే**

వానాకాలం, యాసంగి సీజన్లలో భారీఎత్తున సన్నధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. వానాకాలంతో పోలిస్తే యాసంగి పంటలో నూకలు అధికంగా వస్తాయి. ఈ నేపథ్యంలో వానాకాలం వడ్లతో వచ్చిన బియ్యాన్ని తెలంగాణ బ్రాండ్ పేరుతో విక్రయించనున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ 'ఈనాడు'కు తెలిపారు.

**రేషన్ దుకాణాల్లోనూ బియ్యం విక్రయం**

రాష్ట్రంలో సూపర్‌మార్కెట్లు, కిరాణా దుకాణాలతో పాటు రేషన్ షాపుల్లోనూ ఈ బియ్యాన్ని విక్రయించనున్నట్లు సమాచారం. రేషన్‌షాపుల్లో ప్రస్తుతం ఆహార భద్రత కార్డు(తెల్లకార్డు) ఉన్నవారికి ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్నవారికి ఏపీఎల్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. తెలంగాణ బ్రాండ్ బియ్యాన్ని ఏపీఎల్ కార్డుదారులు కొనుగోలు చేసేందుకు వీలుగా రేషన్ దుకాణాల్లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలుస్తోంది.

**ధరపై అధికారుల కసరత్తు**

తెలంగాణ బ్రాండ్‌తో విక్రయించే బియ్యానికి ధర ఎంత నిర్ణయించాలన్న విషయంపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు ప్రస్తుతం మార్కెట్లో ఉన్న సన్నబియ్యం ధరలను పరిశీలిస్తున్నారు. ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి ఇస్తే డబ్బులు రావడానికి కనీసం ఆరు నెలల నుంచి ఏడాది వరకు సమయం పడుతుందని.. అదే తెలంగాణ బ్రాండ్‌తో బియ్యాన్ని విక్రయిస్తే వెంటనే డబ్బులు వస్తాయని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఈ బియ్యాన్ని విక్రయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ వర్గాల సమాచారం.

# రాజధానిలో 65 వేల కొత్త ఆటోలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం 65 వేల కొత్త ఆటోలకు అనుమతిస్తూ నిర్ణయం తీసుకుంది. వాటికి రవాణాశాఖ పర్మిట్లు జారీ చేయనుంది. అయితే కొత్తగా వచ్చే ఆటోలను హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతం వరకే పరిమితం చేస్తున్నట్లు రవాణాశాఖ స్పష్టం చేసింది. కాలుష్య సమస్యకు దారితీసే డీజిల్, పెట్రోల్‌తో నడిచేవాటికి కాకుండా ఇంధనంగా సీఎన్జీ, ఎల్పీజీ వంటి వాటిని ఉపయోగించే ఆటోలకే అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ మేరకు రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక వ్యక్తికి ఒకటికి మించి పర్మిట్లు ఇవ్వొద్దని రవాణాశాఖ స్పష్టం చేసింది.

**సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా..**

ఆటోల సంఖ్య పెరిగినా కాలుష్యం పెరగదని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తాజా నిర్ణయంతో 65 వేల కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. 'సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించడానికి ఈ నిర్ణయం ఎంతగానో ఉపయోగపడుతుంది' అని పేర్కొన్నారు.

# ఘనంగా బక్రీద్ వేడుకలు

దిల్లీ: దేశవ్యాప్తంగా ముస్లింలు శనివారం ఈద్‌ఉల్‌అదా (బక్రీద్)ను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. మసీదుల్లో ప్రార్థనలు చేశారు. బక్రీద్ సందర్భంగా ముస్లింలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనగర్‌లోని హజ్రత్‌బల్ దర్గాలో 40 వేల మంది ప్రార్థనలు చేశారు. "అందరికీ ఈద్ ఉల్‌అధా శుభాకాంక్షలు. ఈ పండగ సమాజంలో సామరస్యాన్ని పెంపొందించాలని, శాంతిని నెలకొల్పాలని కోరుకుంటున్నా. అలాగే అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నా" అని మోదీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

# రాజీవ్ స్వగృహ, హౌసింగ్ బోర్డు స్థలాల వేలం

(మొదటిపేజీ తరువాయి)

స్వగృహ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 11 ప్రాంతాల్లో పూర్తయిన, నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనాల్లోని ఫ్లాట్లు, ఖాళీ స్థలాలకు బహిరంగ వేలం నిర్వహిస్తారు. రాజీవ్ స్వగృహ పరిధిలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గాజులరామారం, పోచారం, ఖమ్మం జిల్లాలోని పోలేపల్లి ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న టవర్లలో(ఒక్కో టవర్‌లో 100 నుంచి 150 వరకు ఫ్లాట్లు ఉంటాయి)ని ఫ్లాట్లను ఏకమొత్తంగా విక్రయిస్తారు. 'ఎలాంటి వివాదాలు లేని భూములను కూడా అందుబాటు ధరకే అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ విక్రయాలతో వచ్చిన నిధులను ఓఆర్ఆర్ సమీపంతోపాటు ఇతర ప్రాంతాల్లో సాధారణ ప్రజల హౌసింగ్ పథకాలకు ఉపయోగిస్తాం' అని హౌసింగ్ బోర్డు పేర్కొంది. బిల్డర్లతో పాటు ఎవరైనా ఒక గ్రూపుగా ఏర్పడి కూడా వేలంలో పాల్గొనవచ్చని తెలిపింది. బహుళ అంతస్తుల భవనాలు అవసరం ఉన్న సంస్థలు కూడా ఈ వేలంలో పాల్గొనడానికి అవకాశం కల్పించినట్లు వెల్లడించింది.

*** రాజీవ్ స్వగృహ ఆస్తుల వివరాలిలా..**

* రంగారెడ్డి జిల్లా తొర్రూర్‌లో 514, కుర్మల్‌గూడలో 20, చందానగర్‌లో 3, మహబూబ్‌నగర్ జిల్లా పరిధి పోతులమడుగులో 111, అమిస్తాపూర్‌లో 45 ఖాళీ ప్లాట్లు.
* మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధి బండ్లగూడలో 159, పోచారంలో 601 పూర్తయిన ఫ్లాట్లు.
* ఖమ్మం జిల్లా పోలేపల్లిలో అసంపూర్తిగా ఉన్న 8 టవర్లతోపాటు 3.38 ఎకరాల ఖాళీ స్థలం.
* గ్రేటర్ హైదరాబాద్ పరిధి కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ 4వ ఫేజ్‌లో ఖాళీగా ఉన్న ఏడు ఎకరాల 33 గుంటల ఖాళీ స్థలం, రెండు ఫ్లాట్లు. సంజీవ్‌రెడ్డినగర్‌లో అసంపూర్తిగా ఉన్న సామాజిక భవనానికి చెందిన 2,605 చదరపు గజాల స్థలం.

# నివురుగప్పిన నిప్పు!

(మొదటిపేజీ తరువాయి)

ట్రంప్‌పై ఎక్స్ వేదికగా తీవ్ర స్థాయి విమర్శలు చేసిన మస్క్ కాస్త వెనక్కి తగ్గారు. ట్రంప్‌పై చేసిన బిగ్‌బాంబ్ పోస్టును ఆయన తొలగించారు. సెక్స్ కుంభకోణంలో నిందితుడైన ఎప్‌స్టెన్‌కు సంబంధించిన దర్యాప్తు ఫైళ్లలో ట్రంప్ పేరుందని మస్క్ ఆరోపించారు. అందువల్లే దర్యాప్తులో వెల్లడైన విషయాలను ఇప్పటివరకూ బహిరంగంగా బయటపెట్టలేదని తీవ్ర విమర్శలు చేశారు. అంతే కాదు భవిష్యత్తులో దీనికి సంబంధించిన చాలా విషయాలు బయటపడతాయని వ్యాఖ్యానించారు. తాజాగా ఆ పోస్టును మస్క్ తొలగించారు.

*** డెమొక్రాట్లకు మస్క్ మద్దతిస్తే తీవ్ర పరిణామాలు: ట్రంప్**

బ్రిడ్జ్‌వాటర్: తనతో ఘర్షణ పడుతున్న ఎలాన్ మస్క్‌కు శనివారం మరోసారి ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో డెమొక్రాట్లకు మద్దతిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మస్క్‌తో వివాదాన్ని పరిష్కరించుకోవడానికి సిద్ధంగా లేనని స్పష్టం చేశారు.

*** పార్టీ పేరుపై మస్క్ వ్యాఖ్య**

ట్రంప్‌నకు వ్యతిరేకంగా పోస్టులు చేస్తున్న మస్క్.. 80 శాతం అమెరికన్లకు ప్రాతినిధ్యం వహించేలా కొత్త పార్టీ స్థాపించడానికి ఇది తగిన సమయమేనా అంటూ ఫాలోవర్లను 'ఎక్స్'లో ప్రశ్నించిన సంగతి తెలిసిందే.. ఆ ఓటింగ్ ఫలితాన్ని ప్రకటిస్తూ.. '80 శాతం మందికి ప్రాతినిధ్యం వహించేలా కొత్త పార్టీ ఇప్పుడు అవసరమే. దీన్ని 80శాతం మంది సమర్థించారు' అని పేర్కొన్నారు. 'ద అమెరికా పార్టీ' అంటూ మస్క్ ఈ పోస్టు చేయడం కలకలం రేపింది. అయితే అమెరికాలో పుట్టని మస్క్‌కు అధ్యక్షుడయ్యే అవకాశం లేదు. ట్రంప్, మస్క్‌ల మధ్య విభేదాలతో షాక్‌కు గురైన రిపబ్లికన్లు శాంతి మంత్రం పఠిస్తున్నారు. ఇద్దరూ మళ్లీ కలిసి పని చేయాలని కోరుకుంటున్నామని సెనేటర్ టెడ్ క్రజ్ అభిప్రాయపడ్డారు. అప్పుడే దేశానికి మంచి చేయగలమని స్పష్టం చేశారు. ఇంకా పలువురు సెనేటర్లు, ప్రతినిధుల సభ సభ్యులు వారిద్దరి మధ్య సయోధ్య కుదరాలని ఆకాంక్షించారు. ట్రంప్, మస్క్‌ల వివాదం ప్రభావం పన్ను, సరిహద్దు బిల్లుపై ఉండబోదని స్పీకర్ మైక్ జాన్సన్ అభిప్రాయపడ్డారు.

# శత్రుత్వం ముగుస్తుందా..!

(మొదటిపేజీ తరువాయి)

గత కొంతకాలంగా క్షీణిస్తున్న భారత్‌కెనడా సంబంధాల్లో ఇదో కీలక పరిణామం.

**విద్వేషం రగిల్చిన ట్రూడో**

కార్నీకి ముందు కెనడా ప్రధానిగా ఉన్న జస్టిన్ ట్రూడో భారత్ విషయంలో అనుసరించిన వైఖరి అందరికీ తెలిసిందే. తన అసమర్థ పాలనను కప్పిపుచ్చుకొనేందుకు, ప్రభుత్వం పడిపోకుండా కాపాడుకోవడానికి, సొంత ఎంపీల్లో పెరుగుతున్న అసంతృప్తిని పక్కదోవ పట్టించడానికి ఖలిస్థానీ వేర్పాటువాదులకు ట్రూడో మద్దతు పలుకుతూ, భారత వ్యతిరేక భావజాలాన్ని కెనడాలో వ్యాప్తి చేశారు. ఓ దేశాధినేతగా కాకుండా ఓ పక్షు రాజకీయ నాయకుడిగా వ్యవహరించారు. ఖలిస్థానీ వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యను భారత ప్రభుత్వంపై నెట్టేసి, రాజకీయ లాభం కోసం అక్కడి సిక్కుల్లో విద్వేషాగ్నులను రగిల్చే ప్రయత్నం చేశారు. అంతర్జాతీయ సంబంధాల్లో ఇలాంటి వైఖరి సరికాదని తెలిసినా తన స్వార్థ ప్రయోజనాల కోసం రెండు దేశాల మధ్య సంబంధాలను సైతం పణంగా పెట్టడానికి ట్రూడో వెనుకాడలేదు. అయితే ఏ రాజకీయ ప్రయోజనాలను ఆశించి ఆ శత్రుత్వాన్ని ట్రూడో పెంచారో అవి మాత్రం ఆయనకు దక్కలేదు. సొంత పార్టీ నేతలే ఆయన్ను పదవి నుంచి దింపేశారు. ఆ తర్వాత అధికార లిబరల్ పార్టీ నేతగా మార్క్ కార్నీ ఎంపికై ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంటనే కార్నీ ఎన్నికలు నిర్వహించి, పార్టీని విజయపథంలో నడిపి మళ్లీ ప్రధాని పగ్గాలు చేపట్టారు. ఎన్నికల ప్రచారంలో కూడా భారత్‌తో సంబంధాలను పునరుద్ధరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**కార్నీది భిన్న వైఖరి**

కార్నీకి కూడా రాజకీయ ప్రాధాన్యాలున్నా, ట్రూడోలా ఖలిస్థానీ వేర్పాటువాదులను వెనకేసుకురాలేదు. భారత్ వ్యతిరేక భావజాలాన్ని పెంచి పోషించలేదు. పైగా తన మంత్రిమండలిలో భారత సంతతికి చెందిన నలుగురికి చోటు కల్పించారు. కీలకమైన విదేశాంగశాఖ మంత్రి పదవి అనితా ఆనంద్‌కు ఇచ్చారు. క్యాబినెట్ కూర్పుతోనే తాను ట్రూడోలా వ్యవహరించబోనన్న సంకేతాలనిచ్చారు. ఖలిస్థానీ అనుకూల సంస్థల కోసం ప్రపంచంలో ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థైన భారత్‌ను కెనడాకు దూరం చేసే ఉద్దేశాలు తనకు లేవన్న విషయాన్నీ స్పష్టం చేశారు. కార్నీ స్వతహాగా బ్యాంకర్. గతంలో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, బ్యాంక్ ఆఫ్ కెనడాలకు గవర్నర్‌గా విధులు నిర్వహించిన అనుభవం ఉంది. ప్రస్తుత బహుళ ధ్రువ ప్రపంచంలో భారత మార్కెట్ ఎంత విలువైందో ఆయనకు తెలుసు. అందుకే కెనడా ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొనే మోదీకి ఆహ్వానం పలికారు. దీనిపై ఖలిస్థానీ అనుకూల సంస్థలు చేస్తున్న వీరంగాన్ని ఆయన పట్టించుకోలేదు. దేశహితాన్ని దృష్టిలో ఉంచుకొనే మోదీని పిలిచానని స్పష్టంచేశారు. ప్రపంచంలోనే భారత్ అతి పెద్ద ప్రజాస్వామ్యదేశం అని వారికి గుర్తు చేశారు.

**ఆ ఫోన్‌కాల్‌లోనే..!**

కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్‌కు గత వారం భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ ఫోన్ చేశారు. ఆ సమయంలోనే ట్రూడో పాలనలో దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబంధాలను గాడిలో పెట్టాలన్న విషయంపై ఇరు దేశాలు ఓ అంగీకారాన్ని వచ్చాయి. ఆ ఫోన్‌కాల్‌లోనే భారత్ జీ7 ఆహ్వానం కూడా ఖరారైందని ఇప్పుడు వార్తలొస్తున్నాయి. న్యూదిల్లీతో సంబంధాలు మెరుగుపరచుకోవడం కోసం కెనడా ఎదురుచూస్తోందని జైశంకర్‌తో ఫోన్ సంభాషణ అనంతరం అనిత ఓ ఇంటర్వ్యూలో అన్నారు. నిజ్జర్ హత్యకు.. భారత్‌కెనడా ద్వైపాక్షిక సంబంధాలకు ముడిపెట్టబోమని అన్నారు. నిజ్జర్ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని తెలిపారు. జీ7లో సభ్యదేశం కాకపోయినా 2019 నుంచి ఆ గ్రూపు శిఖరాగ్ర సదస్సులకు భారత్‌కు ఆహ్వానం అందుతూనే ఉంది. ఈ నెల 15 నుంచి 17 వరకు కెనడాలోని జరగనున్న ఈ సదస్సు ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో మనకు చాలా కీలకం. పాక్ ఉగ్ర కుట్రలను ప్రపంచానికి మరింత బలంగా తెలియచెప్పే అవకాశాన్ని ఈ వేదిక కల్పించనుంది. అంతేకాదు, ట్రూడో హయాంలో పెరిగిన శత్రుత్వాన్ని పక్కనపెట్టి భారత్‌కెనడా సంబంధాలను మళ్లీ గాడిలో పెట్టడానికీ మోదీ కెనడా పర్యటన దోహదపడనుంది.

# ఎమ్మెల్యేలు గాడి తప్పితే వదులుకోవడానికీ సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నవారిని ఉపేక్షించబోనని, అవసరమైతే వారిని వదులుకోవడానికీ సిద్ధమని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. 'మీలో కొందరు వన్‌టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోవాలనుకుంటే అది మీ ఇష్టం' అని వ్యాఖ్యానించారు. అందరి జాతకాలూ తనవద్ద ఉన్నాయని, వారి పనితీరు, వ్యవహారాలపై ఎప్పటికప్పుడు సర్వే నివేదికలు, సమాచారం తెప్పిస్తున్నానని తెలిపారు. కొందరు బాగా పనిచేస్తున్నారంటూ వారిని అభినందిస్తూనే, గాడి తప్పిన నేతలను ఉపేక్షించబోనని గట్టిగా హెచ్చరించారు. ఒకరిద్దరి కోసం పార్టీ, ప్రభుత్వ ప్రయోజనాలను పణంగా పెట్టలేనన్నారు. అలాంటివారిని దూరంగా పెడతానని, వారిని వదులుకునేందుకూ సిద్ధమని ఒకటికి రెండుసార్లు స్పష్టంచేశారు. త్వరలోనే ప్రతి ఎమ్మెల్యేతో ముఖాముఖి భేటీలు నిర్వహిస్తానని, వారి పనితీరుపై నివేదికలు త్వరలో వ్యక్తిగతంగా అందజేస్తామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో చంద్రబాబు శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పనిచేసినవారికి గుర్తింపు, మెరుగైన అవకాశాలు ఉంటాయని చెబుతూ, పనిచేయనివారి విషయంలో 1995 నాటి విధానం అమలు చేస్తానని తెలిపారు.

**జాగ్రత్తగా ఉండండి..**

'మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు మరింత బాధ్యతగా పనిచేయాలి. ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి. ఎమ్మెల్యేగా గెలిచాం కదా.. అని ఎవరైనా అతివిశ్వాసంతో వ్యవహరిస్తే వారికే ఎక్కువ నష్టం జరుగుతుంది. మీరు వన్‌టైం ఎమ్మెల్యేలుగా మిగిలిపోరాదన్నది నా ఆలోచన. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు మనల్ని గమనిస్తుంటారు. గత ప్రభుత్వాన్ని భరించలేకే ప్రజలు మనకు ఏకపక్షంగా ఓట్లేసి గెలిపించారు. ప్రజలు శాశ్వతంగా మనతో ఉండేలా చూసుకోవాలి. వారిలో నమ్మకాన్ని కలిగించాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై సర్వే చేయించి నివేదికలు తెప్పించుకుంటున్నాను. మంచి చేస్తే మరిన్ని అవకాశాలు కల్పిస్తాను. తప్పు చేస్తే దూరం పెడతాను. మెజారిటీ ఎంపీలు, ఎమ్మెల్యేలు వారి పనితీరుతో ప్రజలకు చేరువయ్యారు. వారి వల్ల పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు వస్తోంది. ఒకరిద్దరి వల్ల అక్కడక్కడ నష్టం కూడా జరుగుతోంది. ఏ ఒక్కరి చర్యల వల్ల అయినా వ్యవస్థకు నష్టం జరుగుతుందంటే అంగీకరించేది లేదు. ప్రజాప్రతినిధులుగా మీరు నిత్యం ప్రజల్లో ఉండాలి. విమర్శలకు, వివాదాలకు, ఆరోపణలకు దూరంగా ఉండాలి' అని చంద్రబాబు స్పష్టం చేశారు. కొన్ని సందర్భాల్లో పరిపాలనలో తప్పులు, అధికారుల తీరు వల్ల కూడా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని, ఈ విషయంలో మంత్రులు మరింత బాధ్యతగా ఉండాలని, తెలిసి చేసినా తెలియక చేసినా తప్పు తప్పేనని అన్నారు.

**12న విజయోత్సవ ర్యాలీలు**

ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ఈ నెల 12న 175 నియోజకవర్గాల్లోనూ విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలని సీఎం సూచించారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు అమరావతిలో మంత్రులు, కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడాదిలో స్పష్టమైన మార్పు చూపించామన్నారు.

*** వైకాపా నాయకులు రాక్షసుల్లా అడ్డుకుంటున్నారు**

'వైకాపా ప్రభుత్వ విధ్వంసకర పాలన వల్ల ప్రజలు భయంకర పరిస్థితుల్ని చూశారు. రాష్ట్రం పేరు వింటేనే పెట్టుబడిదారులు పారిపోయే దుస్థితిని వైకాపా ప్రభుత్వం కల్పించింది. అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని ఆర్థికంగా అధఃపాతాళంలోకి తొక్కేశారు. అయినా మనం సమస్యలను చూసి పారిపోలేదు. ఏడాదిలో చాలా మార్పు తెచ్చాం. మనం తీసుకున్న నిర్ణయాలతో మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రజలకు మనం చేస్తున్న మంచి చెప్పాలి. వైకాపా ప్రభుత్వ అరాచకాలను గుర్తుచేయాలి' అని సీఎం పేర్కొన్నారు. 'గత పాలకులు విధ్వంసం చేసిన రాష్ట్రాన్ని సర్వశక్తులూ ఒడ్డి ముందుకు తీసుకెళుతున్నాం. ఆ ఫలితాలను అడ్డుకోవడానికి వైకాపా నాయకులు రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నారు. అయినా రాష్ట్ర పునర్నిర్మాణ యజ్ఞం ఆగదు' అని ఆయన స్పష్టంచేశారు.

*** పదవుల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం**

'మనకు పదవుల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం. నేను దిల్లీ వెళ్లిన ప్రతిసారీ కేంద్రమంత్రుల్ని కలిసి అదే చెబుతున్నాను. రాష్ట్రానికి చేయూతనివ్వాలని కోరుతున్నాను. పోలవరంబనకచర్ల అనుసంధానంతో అద్భుత ఫలితాలు వస్తాయి. దానివల్ల తెలంగాణకు ఎలాంటి నష్టం జరగదు. సముద్రంలో వృథాగా కలిసే 3 వేల టీఎంసీల గోదావరి జలాల్లో 200 టీఎంసీలనే మనం వినియోగించుకుంటాం. తెలుగు ప్రజలు ఎక్కడ ఉన్నా నాకు అందరూ ముఖ్యమే. తెలంగాణ ప్రభుత్వం గోదావరి నదిపై కట్టిన ఏ ఒక్క ప్రాజెక్టునూ తెదేపా వ్యతిరేకించలేదు. కొందరు సెంటిమెంట్‌ను రెచ్చగొట్టాలని చూస్తున్నారు' అని పేర్కొన్నారు. ఈ నెల 21న విశాఖలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పార్టీ శ్రేణులు భాగస్వాములై, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విశాఖలో 5లక్షల మందితో యోగాడే నిర్వహిస్తున్నామని, అదేరోజు రాష్ట్ర వ్యాప్తంగా ఆ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

# భారతీయ జనతా పార్టీ అంబర్ పేట డివిజన్ ఉపాధ్యక్షులుగా వినోద్ యాదవ్



అంబర్ పేట, జూన్, 7 (సమయం న్యూస్) : భారతీయ జనతా పార్టీ అంబర్ పేట డివిజన్ కు వైస్ ప్రెసిడెంట్ గా శ్రీ బీరెల్లి వినోద్ యాదవ్ ను నియమించినట్లు డివిజన్ అధ్యక్షులు నరేష్ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. మీడియా తో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఉపాధ్యక్షులుగా నియమించినందుకు పెద్దలు కాషాయ దళపతి కేంద్ర మంత్రివర్యులు శ్రీ జి కిషన్ రెడ్డి కి, సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షులు శ్రీ గౌతమ్ రావు కి, సెంట్రల్ జిల్లా అధ్యక్షులు లంకాల దీపక్ రెడ్డి కి , మరియు డివిజన్ సీనియర్ నాయకులకు, పదాధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీని అంబర్ పేట డివిజన్లో మరింత క్రియాశీలకంగా అభివృద్ధి చేస్తానని ప్రజా సమస్యలు అధికారుల దృష్టికి తీసుకుపోవడానికి నిరంతరం కృషి చేస్తానని వినోద్ యాదవ్ తెలియజేశారు.



భామిని మండలం ఘనసర గ్రామంలో రామకృష్ణ మరియు సత్యవతి ల వివాహ వేడుక, కోసలి గ్రామంలో శ్యాంసుందరరావు మరియు పావని ల వివాహ వేడుకలో పాల్గొని నవ వధూవరులను ఆశీర్వదించిన పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ.

*- జూన్ 7, భామిని మండలం, సమయం న్యూస్,*

# తెలంగాణ కల్పతరువు కాళేశ్వరం

- **ఇంజనీరింగ్ అద్భుతమని సీడబ్ల్యూసీనే చెప్పింది**
- **తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టుకు మహారాష్ట్ర ప్రభుత్వం ససేమిరా**
- **అందుకే ప్రత్యామ్నాయం.. కేంద్ర సంస్థ వాప్కోస్ ఎంపిక చేసిందే మేడిగడ్డ**
- **మేడిగడ్డలోని 85 పియర్లలో కుంగినవి రెండే**
- **దీనికే కాళేశ్వరం కుప్పకూలిందంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం**
- **కమిషన్ ముందుకు తప్పకుండా వెళ్తాం**
- **కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని పటాపంచలు చేస్తాం: హరీశ్‌రావు**

హైదరాబాద్: భవిష్యత్ లో ప్రతికూల పరిస్థితుల్లోనూ తెలంగాణ రాష్ట్రానికి కల్పతరువు కాళేశ్వరం ప్రాజెక్టు అని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు స్పష్టం చేశారు. ''హైదరాబాద్‌కు 30 టీఎంసీలు, జనగామ, కరీంనగర్, మేడ్చల్ తదితర జిల్లాలకు 10 టీఎంసీలు, పరిశ్రమలకు 16 టీఎంసీలు అవసరమవుతాయి. వీటికి కాళేశ్వరం జలాలు వినియోగించుకోవచ్చు. గత ఏడాది వర్షాలు బాగా పడ్డాయి కాబట్టి మనకు ఇబ్బందులు రాలేదు. మిడ్‌మానేరు నుంచి నీళ్లు తెచ్చుకున్నాం. ఒకవేళ కరవు వస్తే.. ఈ అవసరాలకు నీటి కొరత ఏర్పడుతుంది. ప్రభుత్వం భేషజాలకు పోకుండా.. వెంటనే మేడిగడ్డను పునరుద్ధరించాలి'' అని ఆయన డిమాండ్ చేశారు. 'కాళేశ్వరంపై దుష్ప్రచారం.. వాస్తవాలు' పేరిట తెలంగాణ భవన్‌లో శనివారం హరీశ్‌రావు సుమారు గంటన్నర సేపు అంశాల వారీగా ఆధారాలు, డాక్యుమెంట్లు చూపుతూ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ''కాళేశ్వరం అనేది ఇంజినీరింగ్ అద్భుతమని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) ఛైర్మనే చెప్పారు. భారాసకు మంచి పేరొస్తుందని కాంగ్రెస్ నాయకులు ఇన్నాళ్లూ బురద చల్లారు. తాము చేసిన ఆరోపణలను నిజం



అని చెప్పించుకోవడానికి విచారణల పేరిట తంటాలుపడుతున్నారు'' అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ''కాళేశ్వరం అంటే ఒక బ్యారేజీ కాదు.. అనేక బ్యారేజీలు, రిజర్వాయర్లు, సబ్‌స్టేషన్ల సమాహారం. ఇందులో మేడిగడ్డ బ్యారేజీని 7 బ్లాకులుగా 85 పియర్లతో నిర్మించారు. వీటిలో కేవలం రెండు పియర్లు కుంగితే.. మొత్తం కాళేశ్వరం కుప్పకూలిందంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది. కమిషన్ ముందుకు వెళ్లడానికి మేం భయపడటం లేదు. తప్పకుండా వెళ్తాం. ప్రాణత్యాగానికే సిద్ధపడిన నాయకుడు.. మీ తాటాకు చప్పుళ్లకు భయపడతారా? కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాలను కమిషన్ ముందు పటాపంచలు చేస్తాం.

*** ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుపై కాంగ్రెస్ నిర్లక్ష్యం**


2007 నుంచి 2014 వరకు కేంద్రంలో, మహారాష్ట్రలో, అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ కాంగ్రెస్ ప్రభుత్వాలే అధికారంలో ఉన్నప్పటికీ.. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం కోసం కేంద్రం నుంచి ఎలాంటి అనుమతి సాధించలేదు. మహారాష్ట్రతో ఎలాంటి ఒప్పందం చేసుకోలేదు. తట్టెడు మట్టి కూడా తవ్వకుండానే.. మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరిట రూ.1,052 కోట్లు ఖర్చు చేసినట్లు కాగ్ అప్పట్లో నివేదిక ఇచ్చింది. 2007లో రూ.17,875 కోట్లకు జీవో ఇచ్చి.. 19 నెలల్లో ఏ పనీ చేయకుండానే ప్రాజెక్టు విలువను రూ.40,300 కోట్లకు పెంచారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేశామని కాంగ్రెస్ చెబుతున్నది అబద్ధం. వాళ్లు చేసిన ఖర్చు కేవలం రూ.3,780 కోట్లు మాత్రమే. అయితే ఆ ప్రాజెక్టును 152 మీటర్ల ఎత్తులో అంగీకరించేది లేదని.. 148 మీటర్ల ఎత్తులో నిర్మిస్తేనే సమ్మతిస్తామని అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి మహారాష్ట్ర ప్రభుత్వం తేల్చిచెప్పిందనే విషయం తెలంగాణ ఏర్పాటైన తర్వాత తెలిసింది.

*** కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజంటేషన్ ఇస్తున్న హరీశ్‌రావు**

మేడిగడ్డకు ఎందుకు మార్చాల్సి వచ్చిందంటే తెలంగాణ ఏర్పడ్డాక.. ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ తీసుకొని మహారాష్ట్ర ప్రభుత్వంతో పలు పర్యాయాలు చర్చలు జరిపారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో నిర్మాణానికి భారాస ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసింది. కానీ అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడణవీస్ ఒప్పుకోలేదు. పైగా తుమ్మిడిహెట్టి వద్ద చాప్రాల్ వైల్డ్‌లైఫ్ ప్రాంతం కూడా ఉండడంతో కేంద్ర అటవీ, పర్యావరణ అనుమతులు సాధించడం కష్టమని, తీవ్ర కాలయాపన జరుగుతుందని తేలింది. ఇదే సమయంలో అవసరమైన నికర జలాలు లేనందున ప్రాజెక్టుపై పునరాలోచించుకోవాలని సీడబ్ల్యూసీ సూచించింది. దీంతో కేంద్ర ప్రభుత్వ సంస్థ వాప్కోస్‌ను తెలంగాణ ప్రభుత్వం సంప్రదించి, నీటి లభ్యత ప్రాంతాన్ని సూచించాల్సిందిగా కోరింది. వాప్కోస్ సమగ్రంగా పరిశీలించి ఎంపిక చేసిన స్థలమే మేడిగడ్డ. దీనిపై మంత్రులుగా నేను, ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావులతో కూడిన మంత్రివర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం నియమించగా.. మా కమిటీ కూడా ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్చాలని నివేదిక ఇచ్చింది. విశ్రాంత ఇంజినీర్ల కమిటీ కూడా మేడిగడ్డ అనువైన ప్రదేశమని నివేదికలో స్పష్టం చేసింది. అయితే తాడిచర్ల బొగ్గుగనులు, సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనులు ఉన్నందున మేడిగడ్డ నుంచి మిడ్‌మానేరుకు నీటి తరలింపులో అవరోధాలు ఎదురవుతాయని సూచించడంతో.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మించి ఎల్లంపల్లికి, అక్కడి నుంచి మిడ్‌మానేరుకు నీటిని తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్, జూరాల, పులిచింతల, సింగూర్, ఎల్లంపల్లి, దేవాదుల ప్రాజెక్టుల అంచనాలు రెట్టింపు నుంచి 107 రెట్ల వరకు కూడా పెరిగాయి. కానీ అతి తక్కువ అంచనా పెంపుతో పూర్తిచేసిన ప్రాజెక్టు దేశంలో కాళేశ్వరం ఒక్కటే. అది కూడా 0.5 రెట్లు మాత్రమే. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా కేవలం 11 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ చేసే అవకాశం ఉండేది. కానీ కేసీఆర్ ముందుచూపుతో కాళేశ్వరం ద్వారా 141 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా 16 రిజర్వాయర్ల నిర్మాణం జరిగింది.

**రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందా?**

ఈ ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరాకు కూడా నీళ్లు రాలేదని కాంగ్రెస్ విమర్శిస్తోంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంజినీర్లు ఇచ్చిన నివేదిక ప్రకారం.. ఈ ప్రాజెక్టు 20 లక్షల ఎకరాలకు నీళ్లు అందించింది. రూ.లక్ష కోట్లు కొట్టుకుపోయాయని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ఆరోపణల్లోనూ నిజం లేదు. ఎన్‌డీఎస్‌ఏ నివేదికలోనే మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేయొచ్చని స్పష్టంగా పేర్కొంది. ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత, డిజైన్ల మీద చేస్తున్న విమర్శలు సత్యదూరమే. నాలుగు దశాబ్దాల్లో ఎన్నడూ రానంతగా 2022లో 29 లక్షల క్యూసెక్కుల వరద, 2023లో 15 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా.. ప్రాజెక్టు చెక్కు చెదరలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌లో అంచనా వ్యయం రూ.80,190 కోట్లు. భారాస ప్రభుత్వం ఖర్చు చేసింది రూ.94 వేల కోట్లు. మరి రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందనేది గోబెల్స్ ప్రచారమే'' అని హరీశ్‌రావు వివరించారు.




# జిన్నారం గిరిజన గురుకుల కళాశాలలో స్పాట్ కౌన్సిలింగ్

*** జిన్నారం, జూన్ 7, సమయం న్యూస్ ;**

జిన్నారం గిరిజన గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో మిగిలి ఉన్న సీట్లకు ఈనెల 13వ తేదీన స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ వెంకటనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తిగల ఎస్టి విద్యార్థులు ఈనెల 13వ తేదీన ఉదయం 10 గంటల వరకు స్థానిక గిరిజన గురుకుల కళాశాలకు సంబంధిత సర్టిఫికెట్లను తీసుకొని రావలసిందిగా ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ఎస్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తో పాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాలు

*** కూల్చివేతకు చర్యలు.**

నిర్మల్ జూన్,07( సమయం న్యూస్) : జిల్లాలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల భవనాల కూల్చివేతకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం కుభీర్ మండలంలోని అంతర్ని గ్రామంలో ప్రభుత్వ పాఠశాల భవనం కూలిన ఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. కూల్చివేతకు అనుమతులు తీసుకున్నప్పటికీ, ఇటీవలి వర్షాల కారణంగా ఆలస్యమైందని వెల్లడించారు. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారని, వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని, ప్రమాదం లేకుండా క్షేమంగా ఉన్నారని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని







కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని పలు పాఠశాలల శిథిల భవనాల కూల్చివేతకు రోడ్లు, భవనాల శాఖ నుంచి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు తీసుకొని తక్షణమే కూల్చివేత ప్రక్రియ చేపట్టనున్నామని తెలిపారు. విద్యార్థులు భద్రతాయుత వాతావరణంలో చదివేలా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు.

# హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మికి ఫోన్‌లో వేధింపులు

హైదరాబాద్: జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మికి ఫోన్ చేసి ఓ దుండగుడు వేధించాడు. అర్ధరాత్రి ఫోన్‌లు చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు. మేయర్‌తో పాటు, ఆమె తండ్రి కేశవరావు అంతు చూస్తానంటూ వాయిస్ మెసేజ్‌లు పెట్టాడు. బోరబండలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన సర్దార్‌కి చెందిన వ్యక్తిగా చెప్పుకొచ్చాడు. అసభ్యకరమైన పదజాలంతో బెదిరిస్తున్నాడంటూ మేయర్ పీఆర్వో పోలీసులకు ఫిర్యాదు



చేశారు. కేసు నమోదు చేసుకున్న బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ముస్లిం సోదరులకు


# బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన సిద్ధార్థ ముదిరాజ్

అంబర్ పేట,జూన్,7(సమయం న్యూస్) : త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగ అల్లా దయతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఈద్ అల్ అదా (బక్రీద్) పండుగ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ అంబర్ పేట డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్ తన కార్యాలయంలో ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం,సహనం ఈ పండుగ ఇచ్చే మంచి సందేశాలన్నారు. దాన ధర్మాలకు ప్రతీక బక్రీద్ పండుగ అని అన్నారు. త్యాగం, సేవకు చిహ్నంగా బక్రీద్ పండుగ నిలుస్తుంది అన్నారు.దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ఈ పండుగ జరుపుకొంటారన్నారు.




భక్తి భావం, విశ్వాసం, కరుణ, ఐక్యతకు సంకేతమైన ఈ పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగ జరుపుకోవాలన్నారు. ఈ పండుగ సోదర భావం, ఐక్యతకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు.అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని అభిలాషించారు.అల్లా దయతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆకుల మల్లేశ్, బొట్టు మహేష్ గౌడ్, నరేంద్ర ముదిరాజ్, సురేష్, దశరథ్, కాశి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్షర వెలుగు



**పోరిక వికాస్**
ప్రెసిడెంట్, ఈఎఫ్ఎల్ యు స్టూడెంట్ యూనియన్ 2024-25

చీకటి మా బతుకులు వెలుగుని కోరుతున్నాయ్....
వెలుగు మాత్రం అక్షరంతోనే వస్తానంటుంది!

ఓ అక్షరమా... నాతో అడవికొస్తావా?
అక్షరాలు కలిస్తేనే పదాలుగా మారతాయి...
ఓ పదమా నాతో మా పల్లెకొస్తావా?
పదాలన్నీ కలిస్తేనే వాక్యమవుతుంది...
ఓ వాక్యమా నాతో మా వాడకొస్తావా?
వాక్యాలన్నీ కలిస్తేనే గేయమవుతుంది...
ఓ గేయమా...నాతో మా గూడెంకొస్తావా?
నువు లేక మా బతుకులు అక్కడే
ఆగిపోయాయ్...
అక్షరం లేక ఆగిపోయిన బతుకులు మావి!

ఓ అక్షరమా... నాతో పాటు మా అడవికొస్తవా?
ఓ అక్షరమా... నాతో పాటు మా పల్లెకొస్తవా?
ఓ అక్షరమా... నాతో పాటు మా వాడకొస్తవా?
ఓ అక్షరమా... నాతో పాటు మా గూడెంకొస్తవా?
ఓ అక్షరమా... నాతో పాటు మా బస్తీకొస్తవా?

నీ కోసం తరాల నుండి వేచి చూస్తున్న బతుకులు ఎన్నో ఉన్నాయ్...
నువు రావాలని బతిమాడుతలేను,
నువు రావడం నా హక్కని అడుగుతున్నాను!
నీ రాకకై వేచిచూస్తుంటా...

# ఘనంగా ప్రపంచ ఎల్పిజి దినోత్సవ వేడుకలు



హైదరాబాద్, జూన్ 6 (సమయం న్యూస్) ప్రపంచ ఎల్పీజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఇండియన్ ఆయిల్ తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాలయంలో ప్రపంచ ఎల్పీజీ దినోత్సవాన్నిఘనంగా నిర్వహించారు. శుభ్రమైన ఇంధనం, ఆరోగ్యకరమైన జీవనం, ఆకుపచ్చ భవిష్యత్తు వైపు ముందడుగు" అనే నినాదంతో నిర్వహించారు. కార్యక్రమానికి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, స్టేట్ హెడ్ పీయూష్ మిత్తల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇండేన్ బ్రాండ్ కేవలం వంట ఇంధనం మాత్రమే కాదని, అది ఆత్మవిశ్వాసానికి, అభివృద్ధికి, స్థిరతకు ప్రతీకగా నిలుస్తోందని ఉద్ఘాటించారు. ఇండేన్ తన విస్తృత డిస్ట్రిబ్యూటర్ నెట్వర్క్, నిబద్ధత కలిగిన డెలివరీ బాయ్స్, డిజిటల్ బుకింగ్ సౌకర్యాల ద్వారా నిత్యం 1.8 లక్షల రీఫిల్ డెలివరీలు నిర్వహిస్తూ తెలుగు రాష్ట్రాల్లో ప్రతి రెండో ఇంటి వంటగదిని శక్తివంతం చేస్తోందని తెలిపారు. ఇండేన్ బ్రాండ్ కేవలం గృహావసరాలకు మాత్రమే కాకుండా, బేకరీ, గ్లాస్, మెటల్, ఆటోమొబైల్, హెల్త్కేర్, లాండ్రీ, ఫోమ్, వ్యవసాయ రంగాల్లో కూడా శుభ్రమైన సమర్థవంతమైన ఇంధన పరిష్కారంగా నిలుస్తోందని మిత్తల్ వివరించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఆయిల్ విలువైన ఛానల్ పార్ట్నర్స్‌ను సురక్షిత వంటగది ప్రచారానికి చేసిన కృషికి గాను శ్రీ మిత్తల్ ఘనంగా సన్మానించారు. ఇది వినియోగదారుల భద్రత పట్ల ఇండియన్ ఆయిల్ యొక్క నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎల్పీజీ డివిజనల్ సేల్స్ హెడ్ సితేష్ కిషన్ పాల్గొని ఎల్పీజీ భద్రతపై అవగాహన పెంపొందించినందుకు వినూత్న పరికాల వినియోగాన్ని ప్రోత్సహించినందుకు చేసిన కృషిని ప్రశంసించారు.

*** అగ్నిమాపక పరికరాల అవగాహన – విజేతలకు బహుమతులు**

ఫైర్ బాల్స్ ను ప్రజలకి అవగాహన కల్పించిన 15 మంది విజేతలకు బహుమతులు అందించారు. విజేతలకు హోండా యాక్టివా 5G స్కూటర్లు అందజేశారు. ఈ ఆటోమేటిక్ ఫైర్ ఎక్స్టింగ్విషర్లు చిన్నవిగా ఉండి, సులభంగా ఇన్స్టాల్ చేయగలిగేలా రూపొందించబడి ఉంటాయి. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఇవి స్వయంగా క్రియాశీలమై వెంటనే అగ్ని నాశక పొడిని విడుదల చేస్తాయి. కార్యక్రమం ద్వారా ఇండియన్ ఆయిల్ సంస్థ యొక్క శుభ్రమైన ఇంధనం, వినియోగదారుల భద్రత , సుస్థిర అభివృద్ధి పట్ల ఉన్న అంకితభావాన్ని నిరూపించిందన్నారు.



# పార్టీ కార్యకర్తలకు అండగా నేనుంటా

**- బిజెపి ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి**

జిన్నారం, జూన్ 7 , సమయం న్యూస్ : భారతీయ జనతా పార్టీకి సంబంధించిన ప్రతి కార్యకర్తకు ఏ ఆపద వచ్చిన నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్సీ డాక్టర్ చిన్న మైల్ అంజిరెడ్డి అన్నారు. జిన్నారం మండలంలోని దాదిగూడ గ్రామంలో భాజపా మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎంకిరి గారి వెంకటేష్ ను శనివారం ఆయన పరామర్శించారు. రెండు నెలలుగా కిడ్నీవ్యాధితో బాధపడుతున్న వెంకటేష్ కు తన వంతు సాయంగా 20 వేల రూపాయలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీకి చెందిన ప్రతి కార్యకర్తకు తోడుంటానని,ఎవరికి ఏ ఆపద వచ్చిన తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు వంగేటి ప్రతాపరెడ్డి ,జిన్నారం మండల పార్టీ అధ్యక్షులు జగన్ రెడ్డి ,దోమదుగు రమేష్,పల్నాటి శ్రీనివాస్, అశోక్ ,కృష్ణ ,తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

*** మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కొలాన్ రోజా బాల్ రెడ్డి**



జిన్నారం, జూన్ 7, సమయం న్యూస్ : దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని బొల్లారం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కోలాన్ రోజా బాల్ రెడ్డి అన్నారు. బొల్లారం మునిసిపాలిటీ పరిధిలో గల శ్రీరామ్ నగర్ కాలనీలో శనివారం శ్రీశ్రీశ్రీ పోచమాంబ ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోలాన్ రోజా బాల్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాలు మన సంస్కృతికి చిహ్నాలని దేవాలయాలను సందర్శించుకుంటే మానసిక ప్రశాంతత నెలకొంటుందని దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని వారు పేర్కొన్నారు . ఆలయ కమిటీ సభ్యులు నిర్వాహకులు అతిథులకు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సంధ్య ,శైలజ, పుండరీకం, భక్తులు, కాలనీవాసులు ,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**- సిజేఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి**





గుమ్మడిదల, జూన్ 7 , సమయం న్యూస్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని సిజేఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి శనివారం అన్నారు. మండల కేంద్రమైన గుమ్మడిదల లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల బృందం ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే నాణ్యమైన విద్య అవకాశాలను వివరించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు విద్యను అందించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ సందర్భంగా సిజేఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణం పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. మౌలిక వసతుల కల్పన కోసం తమ ట్రస్ట్ ఎల్లప్పుడు అందుబాటులో వుంటుందని వారు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయుల చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం .. భారీగా తరలి వస్తున్న జనం



హైదరాబాద్: ఆస్తమాతో బాధపడుతున్న రోగులకు బత్తిన సోదరులు ఏటా ఉచితంగా సరఫరా చేసే చేప ప్రసాదం పంపిణీకి హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. 8, 9 తేదీల్లో జరిగే పంపిణీకి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తెలంగాణ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంది. మృగశిర కార్తె సందర్భంగా బత్తిన కుటుంబ సభ్యులు ఏటా చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నారు. ఈ సారి పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా పంపిణీ ప్రారంభించనున్నారు. ఈ చేప ప్రసాదం కోసం కేవలం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి కూడా ఆస్తమా బాధితులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. ఇప్పటికే నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానానికి ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు చేరుకున్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. చేప ప్రసాదం కోసం వచ్చిన ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ సారి 42 క్యూలైన్లను ఏర్పాటు చేశారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

*** వచ్చిన భక్తులకు అన్నదానం చేసిన బండారి గంగాధర్ దంపతులు**



శివ్వంపేట జూన్ 07 (సమయం న్యూస్) : శివ్వంపేట మండలం పిలుట్ల గ్రామంలో జరిగిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో మల్కాజ్గిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సుహాసిని రెడ్డి పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, శివ్వంపేట్ మండల అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాధర్, కొడకాంచి శ్రీనివాస్ గౌడ్, మురళి, నర్సాపూర్ మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు అశోక్ గౌడ్, దాడిగా నరేష్, సతీష్,శివ గౌడ్ రత్నపూర్ మహేష్,మహేష్‌గౌడ్, సుధీర్ కుమార్ గౌడ్, ఆంజనేయులు,ఆలయ కమిటీ సభ్యులు స్థానిక నాయకులు పాల్గొన్నారు . పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు బండారి గంగాధర్

# కాళేశ్వరం వివాదంలోకి అనవసరంగా లాగుతున్నారు

- **కమిషన్ ముందు ఈటల అబద్ధాలు చెప్పారంటూ ఆరోపణ**
- **సబ్ కమిటీకి, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధం లేదని వెల్లడి**
- **మేడిగడ్డ అనుమతుల తర్వాతే కమిషన్ వేశారని వ్యాఖ్య**
- **సుమోటోగా కమిషన్ ముందుకు వెళ్లి వివరాలు అందిస్తానన్న తుమ్మల**
- **ప్రాణహితపై మాత్రమే స్టేటస్ రిపోర్ట్ ఇచ్చామని స్పష్టీకరణ**

కాళేశ్వరం ప్రాజెక్టు వివాదంలోకి తనను అనవసరంగా లాగుతున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కాళేశ్వరం అంశంపై విచారణ జరుపుతున్న కమిషన్ ఎదుట మాజీ మంత్రి ఈటల రాజేందర్ పూర్తిగా అవాస్తవాలు చెప్పారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో తనపై వస్తున్న ఆరోపణలపై మంత్రి తుమ్మల శనివారం హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ, "కాళేశ్వరం కమిషన్ ముందు ఈటల రాజేందర్ అబద్ధాలు చెప్పాల్సిన అవసరం ఏమొచ్చింది? ఆయన అనాలోచితంగా వాంగ్మూలం ఇచ్చారా లేక అలాంటి పరిస్థితులు కల్పించారా?" అని ప్రశ్నించారు. తప్పుడు ప్రకటనలతో ప్రజలను ఎక్కువ కాలం మభ్యపెట్టలేరని హితవు పలికారు. తన హయాంలోని సబ్ కమిటీకి, కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. మేడిగడ్డ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చిన తర్వాతే కమిషన్ వేశారని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై గతంలో తాను ఛైర్మన్‌గా ఉన్న సబ్ కమిటీ ఎప్పుడూ నివేదిక ఇవ్వలేదని తుమ్మల తెలిపారు. కేవలం ప్రాణహిత ప్రాజెక్టుపై మాత్రమే అప్పటి పరిస్థితులకు అనుగుణంగా స్టేటస్ రిపోర్ట్ ఇచ్చామని వివరించారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై మాత్రమే





తెలంగాణ ప్రభుత్వం కమిషన్ వేసిందని, ఈ విషయంలో పూర్తి వివరాలను తాను సుమోటోగా కమిషన్ దృష్టికి తీసుకెళతానని మంత్రి ప్రకటించారు.

# భవిష్యత్తు అంతా గ్రీన్ పవర్ దే

* **గ్రీన్ పవర్ ఉత్పత్తికి ఇప్పటికే లక్ష కోట్ల పెట్టుబడి కి MOU లు**
* **2030 నాటికి 20,000 మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యం**
* **పెరుగుతున్న డిమాండ్ మేరకు విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవాల్సిన అవసరం ఉంది**
* **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

హైదరాబాద్ జూన్ 07(సమయం న్యూస్) : భవిష్యత్తు అంతా గ్రీన్ పవర్ దే, ఆ మేరకు తెలంగాణ రాష్ట్రం ప్రాధాన్యరంగంగా గుర్తించి, ప్రణాళికలతో ముందుకు వెళుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు.శనివారం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పిన్నాపురం గ్రామంలో గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ పవర్ ప్రాజెక్టును సందర్శించిన అనంతరం ఆయన స్థానికంగా మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రీన్ పవర్ ఉత్పత్తికి సంబంధించి లక్ష కోట్ల రూపాయలు విలువైన MOU లు జరిగాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. తెలంగాణ రాష్ట్రం 20 25 న్యూ ఎనర్జీ పాలసీని తీసుకువచ్చింది, 2029 30 నాటికి తెలంగాణ రాష్ట్రంలో 200 గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు పోతున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్తు వీడియో గాని దృష్టిలో పెట్టుకొని వివిధ మార్గాల్లో విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలను అన్వేషిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మిగులు విద్యుత్ దిశగా ముందుకు పోతుందని తెలిపారు. ఈ ప్రపంచంలో ప్రతి ఉత్పత్తికి విద్యుత్తు అవసరం, ఉత్పత్తి పెరగాలంటే విద్యుత్తు సరఫరా పుష్కలంగా ఉండాలి, ఉత్పత్తులు పెరిగితే ఉపాధితో పాటు రాష్ట్ర జీడీపీ పెరుగుతుంది ఇదంతా ఒక చక్రంలా తిరుగుతుందని డిప్యూటీ సీఎం వివరించారు. దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతోంది కేవలం బొగ్గు ఆధారంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తే ఖర్చు పెరగడంతో పాటు, కాలుష్యం పెరిగి వాతావరణ సవాతుల్యం దెబ్బతింటుంది. ఈ నేపథ్యంలో ప్రపంచం మొత్తం గ్రీన్ పవర్ వైపు పరుగులు పెడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. అన్ని దేశాలు సోలార్ తో పాటు విండ్, థర్మల్, అప్పుడు స్టోరేజ్, ఫ్లోటింగ్ సోలార్, హైడ్రోజన్ పవర్ వంటి మార్గాల ద్వారా విద్యుత్పత్తిని ప్రోత్సహిస్తూ ముందుకు పోతున్నాయని తెలిపారు. పగలు సోలార్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్ ను స్టోరేజీ చేసుకొని, రాత్రివేళ పంపుడు స్టోరేజ్ ద్వారా పీక్ అవర్స్ లో విద్యుత్తు ఉత్పత్తి చేయడం విదేశాలకు సరఫరా చేస్తున్న గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ పవర్ ప్రాజెక్టును కంపెనీ యాజమాన్యం ఆహ్వానం మేరకు గ్రీన్ పవర్ ఉత్పత్తి పరిశీలనకు కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పిన్నాపురం గ్రామానికి వచ్చినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. గ్రీన్ కో పవర్ కంపెనీ అనుకున్న సమయానికి విద్యుత్తు ఉత్పత్తిని ప్రారంభించడం అభినందించదగిన విషయం అన్నారు.వారు 4వేల ఎకరాల విస్తీర్ణంలో ఒకే చోట





సోలార్, విండ్, పంపుడ్ స్టోరేజీ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడం ప్రపంచంలోనే మొదటిసారి అని తెలిపారు. గ్రీన్ కో కంపెనీ సోలార్ ద్వారా నాలుగు వేల మెగావాట్లు, విండ్ పవర్ ద్వారా వేయి మెగావాట్లు, పంపుడు స్టోరేజీ ద్వారా 1,680 మెగావాట్లు మొత్తంగా ఒకే చోట 6,680 మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి అభినందించదగిన విషయం అన్నారు. దేశంలో భవిష్యత్తులో గ్రీన్ కో వంటి ప్రాజెక్టులు పెద్ద ఎత్తున రావాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రీన్ కో పవర్ ప్రాజెక్టును సందర్శించిన డిప్యూటీ సీఎం గ్రీన్ కో పవర్ ప్రాజెక్టు సందర్శనలో భాగంగా భాగంగా డిప్యూటీ సీఎం ప్రాజెక్ట్ సైట్ పై హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. క్లోజ్డ్ లూప్ పంప్డ్ స్టోరేజ్ సిస్టమ్ కు సంబంధించిన ఎగువన మరియు కింది రిజర్వాయర్లు, పవర్ హౌస్ కాంప్లెక్స్, ఆధునిక సబ్ స్టేషన్ వంటి కీలక మౌలిక సదుపాయాలను పరిశీలించారు. గ్రీన్ కో సంస్థకు చెందిన ఇంజినీర్లు మరియు నిర్వహణ బృందంతో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి, ఈ ప్రాజెక్టులో సోలార్ పవర్, విండ్ పవర్ మరియు రోజుకు రెండు సార్లు నాలుగు గంటల నిల్వ సామర్థ్యంతో కూడిన 1,680 మెగావాట్ల హైడ్రో పవర్ నిల్వ వ్యవస్థ కలిపి నిర్వహిస్తున్న విధానాన్ని డిప్యూటీ సీఎం తన అధికార బృందంతో కలిసి పర్యటించారు. డిప్యూటీ సీఎం వెంట ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్, జెన్ కో cmd హరీశ్, దేవరకద్ర నియోజకవర్గం mla మధుసూదన్ రెడ్డి, వనపర్తి mla మేఘా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం.. గంటకు పైగా నిలిపివేత





విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో రైల్వే సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారు. భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్ వెళ్తుండగా ఈ ఘటన తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో రైల్వే స్వేషన్‌లో జరిగింది. రైలు ఏసీ కోచ్‌లో సమస్య తలెత్తినట్లు గుర్తించారు. గంటకు పైగా రైల్వే సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారు. మరోవైపు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. మరమ్మతుల తర్వాత రైలు యథావిధిగా సికింద్రాబాద్ బయల్దేరి వెళ్తుందని రైల్వే అధికారులు తెలిపారు.

## లాస్ ఏంజెలెస్‌లో అక్రమ వలసదారుల అరెస్టు..

అక్రమ వలసదారులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉక్కుపాదం మోపుతున్న విషయం తెలిసిందే. తాజాగా ట్రంప్ ఆదేశాల మేరకు అక్రమ వలసదారుల ఏరివేతకు ఫెడరల్ అధికారులు శుక్ర వారం లాస్ ఏంజెలెస్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగరంలోని ఫ్యాషన్ డిస్ట్రిక్ట్‌లో ఫెడరల్ ఏజెంట్లు అక్రమ వలసదారుడనే కారణంతో ఒక దుస్తుల వ్యాపారిపై దాడి చేసి, అనేకమంది ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నారు. దీంతో వారి చర్యలకు వ్యతిరేకంగా లాస్ ఏంజెలెస్‌లో ప్రజలు పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. వందల సంఖ్యలో ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. రోడ్ల పైకి రావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లాఠీలు, టియర్ గ్యాస్ ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టారు. పదుల సంఖ్యలో నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. సర్వీస్ ఎంప్లాయీస్ ఇంటర్నేషనల్ యూనియన్ కాలిఫోర్నియా అధ్యక్షుడు డేవిడ్ హుయెర్టాను కూడా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో మరింత రెచ్చిపోయిన ఆందోళనకారులు లాస్ ఏంజెలెస్‌లోని ఫెడరల్ భవనం వెలుపల వందలాది మంది గుమిగూడి.. ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులను అడ్డుకోవడానికి ఫెడరల్ అధికారులు వారిపై పెప్పర్ స్ప్రేను ఉపయోగించారని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. దీనిపై అధికారులు స్పందిస్తూ.. అక్రమ వలసదారులను దేశం నుంచి పంపడానికి అమెరికా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే వారిని అరెస్ట్ చేశామన్నారు.

## ముంబయి ఐసీటీకి ముకేశ్ అంబానీ రూ.151 కోట్ల భారీ విరాళం



ముంబయి: రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముకేశ్ అంబానీ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. తాను చదువుకున్న ముంబయిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి రూ.151 కోట్ల భారీ విరాళాన్ని ప్రకటించారు. ప్రముఖ రసాయన శాస్త్రవేత్త, ప్రొఫెసర్ ఎంఎం శర్మ జీవిత చరిత్ర 'డివైన్ సైంటిస్ట్' పుస్తకావిష్కరణ సభకు హాజరైన సందర్భంగా ఈ ప్రకటన చేశారు. ఈ మొత్తాన్ని దేనికైనా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. 1970లో ఐసీటీ నుంచి ముకేశ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నారు. గతంలో దీన్ని యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీగా వ్యవహరించేవారు. ఐసీటీలో మూడు గంటలకు పైగా గడిపిన ముకేశ్ అంబానీ.. తన ప్రసంగంలో యూడీసీటీలో తాను చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ప్రొఫెసర్ శర్మతో అనుబంధం, తర్వాతి కాలంలో ఆయన భారత ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలకు ఎలా శ్రీకారం చుట్టిందీ వెల్లడించారు. భారత పరిశ్రమను లైసెన్స్ పర్మిట్ రాజ్ నుంచి విముక్తి కలిగిస్తేనే భారతదేశం పారిశ్రామిక దేశంగా వృద్ధి చెందుతుందని, ప్రపంచంలోని ఇతర దేశాలతో పోటీపడడం సాధ్యమవుతుందని శర్మ చెప్పేవారన్నారు. ఇదే విషయాన్ని పాలకులకు వివరించడంలో సఫలీకృతులయ్యారని పేర్కొన్నారు. తన తండ్రి ధీరూబాయ్ అంబానీలానే దేశాన్ని పారిశ్రామికంగా ఉన్నతంగా తీర్చిదిద్దాలని తపించేవారని పేర్కొన్నారు. ఆయనను 'గురు ఆఫ్ భారత్'గా కొనియాడారు. ఆయనకు గురుదక్షిణగా ఐసీటీకి రూ.151 కోట్లు విరాళం ఇస్తున్నట్లు అంబానీ ప్రకటించారు.

## రాజీవ్ స్వగృహ
# ఆస్తుల అమ్మకానికి ప్రభుత్వం పచ్చజెండా

* **రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆస్తుల విక్రయానికి ప్రభుత్వ నిర్ణయం**
* **ఫ్లాట్లు, టవర్లు, ఖాళీ స్థలాలను దశలవారీగా అమ్మకం**
* **అభివృద్ధి పనులకు నిధుల సేకరణే ప్రధాన ఉద్దేశం**
* **ఈ నెల 20 నాటికి విక్రయ నోటిఫికేషన్ జారీకి ఏర్పాట్లు**




తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల నిధుల సమీకరణకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ పరిధిలోని అపార్ట్‌మెంట్ ఫ్లాట్లు, టవర్లు, ఖాళీ స్థలాలను విక్రయిం చేందుకు సిద్ధమవుతోంది. ఈ ఆస్తులను దశలవారీగా అమ్మకానికి ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సం బంధించిన నోటిఫికేషన్ ఈ నెల 20వ తేదీ నాటికి విడుదల చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ విషయంపై గృహనిర్మాణ బోర్డు కమిషనర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ, రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మొత్తం 11 ప్రాంతాలలో నిర్మాణం పూర్తయిన, పాక్షికంగా పూర్తయిన అపార్ట్‌మెంట్లు, ఓపెన్ ఫ్లాట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు, హౌసింగ్ బోర్డు పరిధిలోని మరో 4 ప్రాంతాల్లో ఉన్న ఓపెన్ ఫ్లాట్లు, ఇతర ఖాళీ స్థలాలను కూడా బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు ఆయన వివరించారు. ప్రభుత్వం చేపట్టనున్న ఈ విక్రయాల ద్వారా ఎలాంటి వివాదాలు లేని, స్పష్టమైన యాజమాన్య హక్కులు కలిగిన ఆస్తులను కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశమని కమిషనర్ గౌతమ్ అభిప్రాయపడ్డారు.

## బెంగళూరు తొక్కిసలాట ఘటనను
# ప్రయాగ్‌రాజ్ దుర్ఘటనతో పోల్చిన కాంగ్రెస్..

* **ప్రశ్నల వర్షం కురిపించిన కేంద్రమంత్రి**
* **చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాటపై కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే ఆగ్రహం**
* **ప్రయాగ్‌రాజ్‌లో 66 కోట్ల మంది వస్తే, బెంగళూరులో 2 లక్షల మందిని నిర్వహించలేకపోయారని విమర్శ**
* **సీఎం, డిప్యూటీ సీఎంల ప్రచార ఆర్భాటమే ఘటనకు కారణమని ఆరోపణ**
* **సీఎం, డిప్యూటీ సీఎం తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్**



చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాట ఘటనను ప్రయాగ్‌రాజ్ దుర్ఘటనతో పోల్చడంపై కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బెంగళూరులోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, "మీరు ప్రయాగ్‌రాజ్ ఘటన గురించి మాట్లాడుతున్నారు. అసలు అక్కడ ఎంతమంది గుమికూడారో మీకు తెలుసా? 66 కోట్లకు పైగా ప్రజలు ప్రయాగ్‌రాజ్‌కు తరలివచ్చారు. అలాంటిది మీరు బెంగళూరులో కేవలం 2 లక్షల మందిని కూడా సరిగ్గా నిర్వహించలేకపోయారు. ముంబైలో ఇలాంటిదే ఒక ఉత్సవం జరిగింది... అక్కడ 10 లక్షల మందికి పైగా హాజరైనా ఒక్క మరణం కూడా సంభవించలేదు" అని కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి అన్నారు. కేవలం 40,000 మంది మాత్రమే పట్టే చిన్నస్వామి స్టేడియంలో కార్యక్రమం నిర్వహించి, ఈ గందరగోళం సృష్టించారని, ఇది కేవలం ప్రచారం కోసమేనని శోభా కరంద్లాజే ఆరోపించారు. "ఈ కార్యక్రమం ద్వారా ఎవరికి ఎక్కువ పేరు వస్తుందనే విషయంలో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్‌ల మధ్య పోటీ నెలకొంది. విధానసౌధ సమీపంలో జరిగే కార్యక్రమానికి అభిమానులను ఆహ్వానిస్తూ సీఎం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) జూన్ 3న తమ లెటర్‌హెడ్‌పై సిబ్బంది, పరిపాలనా సంస్కరణల శాఖ (డీపీఏఆర్) కార్యదర్శికి లేఖ రాస్తూ, సీఎం మరియు డిప్యూటీ సీఎం ఈ కార్యక్రమానికి హాజరై ఆర్సీబీ ఆటగాళ్లను సత్కరించాలని అభ్యర్థించింది. ఇప్పుడేమో 'మాకేమీ తెలియదు' అంటున్నారు" అని ఆమె విమర్శించారు. "ముందు మేజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు. సీఎంకు వ్యతిరేకంగా ఒక డిప్యూటీ కమిషనర్ విచారణ చేయగలరా అని మేము ప్రశ్నించాం. ఆ తర్వాత మీరు మైఖేల్ డి'కున్హా కమిషన్‌ను ఏర్పాటు చేశారు. కోవిడ్ కుంభకోణంపై విచారణకు డి'కున్హాను నియమించారు. ఆయన ఆ నివేదికను ఇంకా సమర్పించలేదు. మాకేమీ వ్యతిరేకత లేదు. రిటైర్డ్ న్యాయమూర్తులందరిలో ఆయన్నే ఎందుకు ఎంచుకున్నారు? మీ ఉద్దేశం ఏమిటి?" అని ప్రశ్నించారు. "ఈ విషాదాన్ని కప్పిపుచ్చడానికే మేజిస్టీరియల్ విచారణ, డి'కున్హా కమిషన్ దర్యాప్తులకు ఆదేశించారు. సుమోటోగా స్వీకరించాలని కర్ణాటక ప్రధాన న్యాయమూర్తికి నేను లేఖ రాశాను. దానిని స్వీకరించారు. కానీ సిట్టింగ్ హైకోర్టు న్యాయమూర్తిని నియమించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది" అని ఆమె అన్నారు. బెంగళూరు పోలీస్ కమిషనర్‌ను సస్పెండ్ చేయడాన్ని కూడా కేంద్ర మంత్రి తప్పుబట్టారు. "అసలు రాజీనామా చేయాల్సింది సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీ.కే. శివకుమార్. సిట్టింగ్ జడ్జితో ఈ విషయంపై దర్యాప్తు జరిపించాలి. ఈరోజు ఆర్సీబీ యాజమాన్య సిబ్బందిని అరెస్టు చేశారు. మిమ్మల్ని ఎందుకు అరెస్టు చేయకూడదు?" అని ఆమె నిలదీశారు. "ప్రభుత్వం అధికారులపై నింద మోపలేదు. కార్యక్రమానికి అనుమతి నిరాకరించిన అధికారులను మీరు సస్పెండ్ చేశారు. తమ పిల్లలు, బంధువులను కార్యక్రమానికి తీసుకెళ్లడానికి ఒత్తిడి తెచ్చి కార్యక్రమం నిర్వహించిన వారికి శిక్ష లేదా" అని ఆమె నిలదీశారు. "స్టేడియంలో మధ్యాహ్నం 3.45 గంటలకు తొక్కిసలాటలో ప్రజలు చనిపోయారు, మీరు సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభించారు. మరణాల గురించి బెంగళూరు నగర బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న సీఎం, డిప్యూటీ సీఎంలకు బాగా తెలుసు. అయినా విధానసౌధలో సంబరాలు కొనసాగాయి. అంటే, మీరు శవాలపై సంబరాలు నిర్వహించారు" అని శోభా కరంద్లాజే తీవ్రంగా ఆరోపించారు. "మీరే అనుమతి ఇచ్చి ఉంటే, పోలీసు అధికారులను ఎందుకు సస్పెండ్ చేశారు? ప్రభుత్వం సమాధానం చెప్పాలి. సన్నద్ధతకు సమయం కావాలని పోలీసులు స్పష్టంగా చెప్పారు. చిన్నస్వామి స్టేడియానికి 21 గేట్లు ఉండగా, మ్యాచ్‌ల సమయంలో సాధారణంగా 19 గేట్లు తెరుస్తారు. జూన్ 4న కేవలం మూడు గేట్లు మాత్రమే తెరిచారు. పాసులతో ఉచిత ప్రవేశం అని ప్రకటించినప్పుడు, అన్ని గేట్లు ఎందుకు తెరవలేదు? అందుకే తొక్కిసలాట జరిగింది" అని ఆమె వివరించారు.




# అచ్చం కాలిఫ్లవర్‌లా ఉండే ఇది మనకు చేసే మేలు ఏమిటో తెలుసా..?

చూసేందుకు అచ్చం కాలిఫ్లవర్ లా ఉంటుంది. ఆకుపచ్చని రంగులో ఉంటుంది. ఇప్పటికే మీకు అర్థమైపోయి ఉంటుంది, మేం దేని గురించి చెబుతున్నామో. అదేనండీ.. బ్రోకలీ. ఇది అచ్చం కాలిఫ్లవర్‌లాగే ఉంటుంది. కానీ పువ్వు మొత్తం ఆకుపచ్చని రంగులో ఉంటుంది. మనకు బ్రోకలీ అనేక చోట్ల లభిస్తుంది. దీని గురించి చాలా మందికి తెలియదు. కానీ ఇది అందించే ఆరోగ్య ప్రయోజనాలు అద్భుతమనే చెప్పాలి. బ్రోకలీని ఆహారంలో భాగం చేసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. అనేక పోషకాలు దీని ద్వారా మనకు లభిస్తాయి. బ్రోకలీ వల్ల పలు వ్యాధులను కూడా నయం చేసుకోవచ్చు. దీన్ని తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్యులు, పోషకాహార నిపుణులు చెబుతున్నారు. బ్రోకలీలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచడంతోపాటు చర్మాన్ని సంరక్షిస్తుంది. కేవలం ఒక కప్పు బ్రోకలీని ఉడకబెట్టి తింటే మనకు రోజుకు కావల్సిన విటమిన్ సిలో 100 శాతం లభిస్తుంది.

**బరువు తగ్గేందుకు..**

బ్రోకలీలో ఉండే విటమిన్ కె గాయాలు అయినప్పుడు రక్తం త్వరగా గడ్డ కట్టేలా చేస్తుంది. దీంతో తీవ్ర రక్త స్రావం అవకుండా జాగ్రత్త పడవచ్చు. బ్రోకలీలో ఫోలేట్ విటమిన్ బి9 అధికంగా ఉంటుంది. ఇది గర్భిణీలకు ఎంతో మేలు చేస్తుంది. శిశువు ఎదుగుదల సరిగ్గా ఉండేలా చేస్తుంది. పుట్టుక లోపాలు రాకుండా చూస్తుంది. కణజాల మరమ్మత్తులకు సహాయ పడుతుంది. బ్రోకలీలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను





ఆరోగ్యంగా ఉంచుతుంది. షుగర్ లెవల్స్ తగ్గేలా చేస్తుంది. కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. ఇందులో ఉండే పొటాషియం బీపీని నియంత్రిస్తుంది. కండరాల పనితీరును మెరుగు పరుస్తుంది.

**రక్తహీనతకు..**

బ్రోకలీలో ఐరన్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది రక్తంలో ఆక్సిజన్ రవాణాకు సహాయం చేస్తుంది. రక్తహీనత రాకుండా చూస్తుంది. బ్రోకలీని తినడం వల్ల క్యాల్షియం సమృద్ధిగా లభిస్తుంది. ఇది ఎముకలు, దంతాలను ఆరోగ్యంగా, దృఢంగా ఉంచుతుంది. కండరాల పనితీరు మెరుగు పడేలా చేస్తుంది. బ్రోకలీలో ఉండే మెగ్నీషియం నాడీ మండల వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. గ్లూకోజ్ నియంత్రణకు సహాయం చేస్తుంది. బీపీని కంట్రోల్‌లో ఉంచుతుంది. ఇవే కాకుండా బ్రోకలీలో విటమిన్లు ఎ, ఇ, బి6లతోపాటు ఫాస్ఫరస్, జింక్ కూడా అధికంగానే ఉంటాయి. బ్రోకలీలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ కారకాలుగా పనిచేస్తాయి. దీని వల్ల శరీరంలో అంతర్గతంగా వచ్చే వాపులు తగ్గిస్తాయి. దీంతో గుండె జబ్బులు, డయాబెటిస్ రాకుండా అడ్డుకోవచ్చు.

**కంటి ఆరోగ్యానికి..**

బ్రోకలీలో ఉండే కెరోటినాయిడ్స్ కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. కంటి చూపు మెరుగు పడేలా చేస్తాయి. శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. క్యాన్సర్ రాకుండా రక్షిస్తాయి. బ్రోకలీలో ఉండే విటమిన్ సి వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా బ్రోకలీతో మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. అయితే దీన్ని ఉడకబెట్టి లేదా పెనంపై కాస్త నెయ్యి వేసి వేయించి తినవచ్చు. ఎంతో రుచిగా ఉంటుంది. పచ్చిగా ఉన్నా కూడా రుచి మాత్రం అద్భుతంగా ఉంటుంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ దీన్ని ఎంతో ఇష్టంగా తింటారు. బ్రోకలీని తింటే అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.





# మెంతి ఆకులతో ఎన్నో ఉపయోగాలు

**మెంతులను మనం వంట ఇంటి పోపు దినుసులుగా ఉపయోగిస్తున్నాం. మెంతుల్లో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. ఆయుర్వేద ప్రకారం మెంతులకు ఎంతో ప్రాధాన్యతను ఇచ్చారు. మెంతులు కేవలం రుచి కోసమే కాక ఔషధంగా కూడా పనిచేస్తాయి. మెంతులను నీటిలో నానబెట్టి తినవచ్చు. లేదా మెంతులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగవచ్చు. అలాగే మెంతి గింజల పేస్ట్‌ను తలకు లేదా ముఖానికి ఉపయోగిస్తారు. ఇక కేవలం మెంతులు మాత్రమే కాదు, మెంతి ఆకులు కూడా మనకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇవి కూడా అనేక ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. మెంతి ఆకులను కొందరు కూరల్లో వేస్తుంటారు. దీంతో కూరలకు చక్కని రుచి, వాసన వస్తాయి. అయితే మెంతి ఆకులను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. ఈ ఆకులతో కలిగే ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.**

**జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..**


మెంతి ఆకుల్లో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. మలబద్దకం తగ్గేందుకు దోహదం చేస్తుంది. తీవ్రమైన మలబద్దకం ఉన్నా సరే రోజూ మెంతి ఆకులను ఉడకబెట్టి తింటుంటే తగ్గిపోతుంది. మెంతి ఆకులను తింటే పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. మెంతి ఆకుల్లో ఉండే ఫైబర్ మన జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది. దీంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే కడుపు ఉబ్బరం, అజీర్తి, ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్ వంటి సమస్యలను మెంతి ఆకులు తగ్గిస్తాయి. ఈ ఆకులను తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. మెంతి ఆకుల జ్యూస్‌ను ఉదయం తాగుతుంటే కొవ్వును కరిగించుకోవచ్చు. దీంతో బరువు కూడా తగ్గుతారు.

**షుగర్ వ్యాధికి..**

మెంతులను తినడం వల్ల డయాబెటిస్ అదుపులో ఉంటుందన్న సంగతి తెలిసిందే. అయితే మెంతులు చాలా చేదుగా ఉంటాయి. కనుక వీటిని అందరూ తినలేరు. అలాంటి వారు మెంతి ఆకులను తినవచ్చు. ఇవి కూడా చేదుగానే ఉంటాయి. కానీ మెంతులతో పోలిస్తే వాటి ఆకులు కాస్త తక్కువ చేదుగా ఉంటాయి. అందువల్ల ఈ ఆకులను తినవచ్చు. వీటిని రసం తీసి తాగవచ్చు. లేదా కూరగా అయినా వండుకుని తరచూ తినవచ్చు. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. షుగర్ ఉన్నవారికి మెంతి ఆకులు ఎంతో మేలు చేస్తాయి. ఈ ఆకులను తినడం వల్ల ఇన్సులిన్‌ను శరీరం సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ అదుపులోకి వస్తాయి. మెంతి ఆకులు శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు.

**గుండె ఆరోగ్యానికి..**

మెంతి ఆకుల్లో ఉండే పొటాషియం శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారు తరచూ మెంతి ఆకులను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. ఈ ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో ఫ్రీ ర్యాడికల్స్ వల్ల జరిగే నష్టం నివారించబడుతుంది. క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకోవచ్చు. మెంతి ఆకుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక శక్తిని సైతం మెరుగు పరుస్తాయి. దీంతో సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు, జ్వరం నుంచి బయట పడవచ్చు. ఇలా మెంతి ఆకులను తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. వీటిని రోజూ ఒక కప్పు మోతాదులో రోజూ ఉడకబెట్టి తినాలి. లేదా రసం అయినా తాగవచ్చు. దీంతో అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటారు.



# తెలుగు రాష్ట్రాల్లో బక్రీద్ ప్రార్థనలు



తెలుగు రాష్ట్రాల్లో బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు మసీదులు, దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. ఆ చిత్రాలు.
























epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక   తెలుగు దినపత్రిక



## అప్పుడు వెస్టిండీస్‌లో మాపై అటాక్ చేశారు : రోహిత్, పుజారా



టీమ్ ఇండియా ఆటగాళ్లు రోహిత్ శర్మ, ఛెతేశ్వర్ పుజారా ఓ షాకింగ్ విషయాన్ని బయటపెట్టారు. టీమ్ఇండియా 'ఎ' తరపున 2012లో వెస్టిండీస్ టూర్‌కు వెళ్లినప్పుడు తమకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని తాజాగా గుర్తు చేసుకున్నారు. ఛెతేశ్వర్ పుజారా సతీమణి పూజ రాసిన 'ది డైరీ ఆఫ్ ఎ క్రికెటర్స్ వైఫ్' పుస్తకాన్ని రోహిత్ ఆవిష్కరించాడు. ఈ బుక్‌లో పుజారాకు సంబంధించిన అనేక విషయాలను పొందుపరిచారు. ఈ సందర్భంగా రోహిత్, పుజారా 2012లో వెస్టిండీస్ టూర్ విషయాలను గుర్తు చేసుకున్నారు. 'నాకు తెలిసి ఇది బుక్‌లో రాసినట్టు లేరు. 2012లో టీమ్‌ఇండియా 'ఎ' వెస్టిండీస్ టూర్‌కు వెళ్లినప్పుడు ఏం జరిగింది? ఏంటి అనే విషయాలు పొందుపరిచారా?' అని పుజారాను రోహిత్ ప్రశ్నించాడు. 'నేనేం చెప్పలేదు. దీని ఈ ఘటన గురించి అవగాహన ఉంది. కానీ, అక్కడ ఏం జరిగిందనే వివరాలు పూర్తిగా తెలియదు' అని పుజారా బదులిచ్చాడు. ఆ రోజును గుర్తు చేసుకుంటూ పుజారా ఇలా అన్నాడు. 'నేను వెజ్‌టేరియన్‌ని. అందువల్ల ఏదైనా శాకాహారం దొరుకుతుందా అని రాత్రిపూట బయటకు వెళ్లాం. ఆ ప్రదేశం ట్రినిడాడ్ అండ్ టొబాగో, రాత్రి 11 గంటలు అయింది. మాకైతే ఎలాంటి భోజనం కనిపించలేదు. మేము వెనక్కి తిరిగి వస్తున్నప్పుడు ఒక అటాక్‌కు గురయ్యాం. దాని గురించి పూర్తిగా చెప్పలేను.

# మౌనంగా చూస్తూ ఉండలేం

## బెంగళూరు తొక్కిసలాట ఘటనపై బీసీసీఐ సీరియస్

ఆర్సీబీ విజయోత్సవ పరేడ్ వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. 11మంది మృతికి కారణమైన ఈ ఘటనను బీసీసీఐ తీవ్రంగా పరిగణిస్తోంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వేడుకల నిర్వహణకు మార్గదర్శకాల జారీకి ఆలోచన చేస్తోంది. ఈమేరకు బీసీసీఐ సెక్రటరీ దేవాజిత్ సైకియా మీడియాతో మాట్లాడారు. ''మేం మౌనంగా చూస్తూ ఉండలేం. ఏదోఒకటి చేయాలి. ఇది ఆర్సీబీకి సంబంధించిన ప్రైవేటు వ్యవహారం. కానీ ఈ దేశంలో క్రికెట్ వ్యవహారాలకు మేం బాధ్యత తీసుకోవాల్సిందే. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రయత్నిస్తున్నాం'' అని వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై టీమ్‌ఇండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ స్పందించిన సంగతి తెలిసిందే. ''నేను ఆడేటప్పుడైనా.. ఇప్పుడైనా, భవిష్యత్తులోనైనా సరే.. విజయోత్సవ ర్యాలీలను నేను సమర్థించను. ఇలాంటివి ప్రజల జీవితాలను ప్రమాదంలో పడేస్తాయి. గెలవడం ముఖ్యం.. వేడుకలు కాదు.



అన్నింటికంటే వ్యక్తుల జీవితాలు ముఖ్యం. కాబట్టి మనం ఎలాంటి పరిస్థితులకైనా సిద్ధంగా లేకపోతే.. ఈ రోడ్‌షోలు నిర్వహించకపోవడమే మంచిది'' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం సాయంత్రం చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతిచెందగా.. 50 మందికి పైగా గాయపడిన ఘటన విషాదం రేపిన విషయం తెలిసిందే. తాజాగా కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) కార్యదర్శి ఎ.శంకర్, కోశాధికారి ఇ.ఎస్. జైరాం తమ పదవులకు రాజీనామా చేశారు. ఆర్సీబీ యాజమాన్యం, కేఎస్‌సీఏ అధ్యక్షుడు రఘురామ్ భట్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ డీఎన్‌ఏ ఎంటర్‌టైన్‌మెంట్‌ను బాధ్యులుగా పేర్కొంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటికే బెంగళూరు నగర కమిషనర్ బి.దయానంద్‌ను సస్పెండ్ చేయగా.. సీఎం సిద్ధరామయ్య రాజకీయ కార్యదర్శిని విధుల నుంచి తొలగించారు. మరికొందరు ఉన్నతాధికారులపైనా బదిలీ/సస్పెన్షన్ వేటు పడింది. ఇక, ఈ ఘటనకు సంబంధించిన ఆర్‌సీబీ మార్కెటింగ్ హెడ్ నిఖిల్ సొసలెతో పాటు డీఎన్‌ఏ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు సునీల్ మ్యాథ్యూ, కిరణ్, సుమంత్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

## గుంటూరులో ఘనంగా 'కన్నప్ప' ప్రీ రిలీజ్ వేడుక



* **గుంటూరు నగరంలో 'కన్నప్ప' సినిమా ప్రీ రిలీజ్ వేడుక**
* **అంగరంగ వైభవంగా జరగనున్న కార్యక్రమం**
* **ఈవెంట్‌ను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించే సౌకర్యం**
* **భారీ అంచనాలతో తెరకెక్కుతున్న 'కన్నప్ప' చిత్రం**
* **సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఈ వేడుక**

తెలుగు సినీ ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'కన్నప్ప' ప్రీ రిలీజ్ వేడుక గుంటూరులో ప్రారంభమైంది. ఈ వేడుకను ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి మోహన్ బాబు, బ్రహ్మానందం, ప్రభుదేవా, ముఖేశ్ రిషి తదితరులు హాజరయ్యారు. కాసేపట్లో హీరో మంచు విష్ణు, ముఖ్య అతిథి ప్రభాస్ కూడా హాజరుకానున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్ అతిథి పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్‌తో, ఉన్నత సాంకేతిక విలువలతో రూపుదిద్దుకుంటున్న 'కన్నప్ప' చిత్రంపై ప్రేక్షకుల్లో మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా విడుదలకు ముందు ప్రచార కార్యక్రమాల్లో భాగంగా చిత్ర యూనిట్ ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను గుంటూరులో ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమం ద్వారా సినిమా ట్రైలర్ లేదా కొత్త పాటలను విడుదల చేసే అవకాశం ఉంది. 'కన్నప్ప' చిత్రం తెలుగుతో పాటు ఇతర భారతీయ భాషల్లో కూడా జూన్ 27న విడుదల కానుంది.



గ్లామరస్ సిల్వర్ ఎన్సెంబుల్‌లో శ్రియ శరణ్ అబ్బురపరుస్తుంది. సొగసైన, వెనుకకు కట్టిన జుట్టు ఆమె ప్రకాశవంతమైన ముఖం మరియు స్టేట్‌మెంట్ చెవిపోగులకు దృష్టిని ఆకర్షిస్తుంది, లుక్‌ను సొగసుతో కలుపుతుంది.

# సినిమా

## తిరుమలలో రాజీవ్ కనకాల, సుమ



కలియుగదైవం వేంకటేశ్వరస్వామిని నటుడు రాజీవ్ కనకాల, ఆయన సతీమణి యాంకర్ సుమ దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామి వారి సేవలో పాల్గొన్నారు. తొలుత అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన వారు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికి వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందజేశారు.

## శ్రీకాళహస్తిలో వరలక్ష్మి శరత్ కుమార్

**భర్తతో కలిసి వచ్చి ప్రత్యేక పూజలు**

ప్రముఖ తమిళ సినీ హీరోయిన్ వరలక్ష్మి శరత్ కుమార్ శ్రీకాళహస్తిలోని జ్ఞానప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి సేవలో పాల్గొన్నారు. స్వామి అమ్మవార్ల దర్శనము చేసుకున్న వారికి వేద ఆశీర్వచనం అనంతరం వాయులింగేశ్వరుని తీర్థ ప్రసాదాలు, చిత్ర పటం అందజేశారు. వారి వెంట బీజేపీ నాయకులు చందు రాయల్, రవి రాయల్, సజ్జ హరీష్, చోటు పవర్, కుమార్ తదితరులు ఉన్నారు.



# ప్రణీత రీ ఎంట్రీ!

'ఏం పిల్లో.. ఏం పిల్లడో' మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ ప్రణీత సుభాష్. ఆ తర్వాత బావ, అత్తారింటికి దారేది, పాండవులు పాండవులు తుమ్మెద, రభస వంటి చిత్రాల్లో నటించి తనకంటూ మంచి ఫేమ్ తెచ్చుకుంది. తెలుగులో అగ్ర హీరోల సరసన నటించినా.. ఎందులో మెయిన్ హీరోయిన్ గా కాకుండా సెకండ్ కథానాయికగానే ఈఅమ్మడికి వరుస అవకాశాలొచ్చాయి. సౌత్‌లో కన్నడ, తెలుగు, తమిళంలో నటించిన ఈ భామ మలయాళంలో మాత్రం నటించలేదు. కానీ హిందీలో హంగామా, భుజ్ వంటి సినిమాలతో పలకరించింది. అయితే ప్రణీత 2021 మే 30న కర్ణాటకకు చెందిన వ్యాపారవేత్త నితిన్ రాజును పెండ్లి చేసుకుని సెటిల్ అయిపోయింది. అప్పటి నుంచి సినిమాలకు దూరంగానే ఉంటుంది. ప్రస్తుతం ఆమెకు ఇద్దరు పిల్లలు పుట్టారు. వయసు మూడున్నర పదులు దాటిపోతోంది. అయినా సరే తన అందం చెక్కు చెదరలేదని ఎప్పటికప్పుడు నిరూపించుకుంటూనే ఉంది. ఘాటు అందాలతో కుర్రాళ్లకు వల వేస్తూనే ఉంటుంది. అయితే ప్రస్తుతం ప్రణీత సినిమాల్లోకి తిరిగి ఎంట్రీ ఇవ్వాలని చూస్తుంది. ఆ క్రమంలోనే తాజాగా క్రేజీ ఫొటోలను పంచుకుంది. ఈ సారి టాప్ లెస్ ట్రీట్ ఇచ్చిందిఈ బ్యూటీ. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# నథింగ్ టు హైడ్



టాలీవుడ్ హీరోయిన్ సమంత క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తెలుగు, తమిళం భాషల్లో అనేక మూవీల్లో నటించిన సామ్.. అందం, అభినయంతో కుర్రాళ్ల హృదయాలను దోచేసింది. అయితే కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న ఈభామ.. ఇప్పుడు శుభం సినిమాతో రీఎంట్రీ ఇచ్చింది. ఈ చిత్రానికి నిర్మాతగా వ్యవహరించిన సామ్.. అదే సినిమాలో గెస్ట్ రోల్ చేసింది. సమంత ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్' సిరీస్ కోసం వర్క్ చేస్తోంది. అలాగే తన నిర్మాణ సంస్థ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై 'మా ఇంటి బంగారం' సినిమా చేయనుంది. దీనికితోడు ఒకవైపు నటిగా, మరోవైపు నిర్మాతగానే కాకుండా పలు బ్రాండ్‌లను ప్రమోట్ చేస్తూ ఫుల్ బిజీగా ఉంటుంది. తాజాగా 'సీక్రెట్ ఆల్కమిస్ట్' సంస్థ ప్రమోషన్‌లో భాగంగా సామ్ ఓ స్పెషల్ వీడియో షేర్ చేసింది. 'నథింగ్ టు హైడ్' అని పేర్కొంటూ ఇందులో ఆమె నవ్వులు పూయిస్తూ కనిపించింది. దీనికి 'ఇదొక మంచి ఉద్దేశంతో మొదలైంది' అంటూ క్యాప్షన్ ఇచ్చింది. అయితే దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ముఖ్యంగా ఆమె మెడపై టాటూ కనిపించకపోవడంపై నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. 'వైఎంసీ (ఏమాయ చేసావె).. టాటూను సమంత తొలగించేశారా?' అని సందేహం వ్యక్తంచేశారు. అలా జరిగి ఉండకపోవచ్చని.. మేకప్‌తో అది కనిపించకుండా కవర్ చేసి ఉండొచ్చని మరికొంత మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.